సీఎం పర్యటన ఏర్పాట్ల పరిశీలన

ఆగిరిపల్లి/నూజివీడు, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి) : నూజివీడు నియోజకవర్గం ఆగిరిపల్లిలో ఈ నెల 11వ తేదీన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పర్యటించ నున్నారు. పీ4 కార్యక్రమంలో ఆయన పాల్గొనున్నారు. ఈ మేరకు బుధవారం మంత్రి కె.పార్థసారథి అధికారులతో కలిసి ఏర్పాట్లను పరిశీలించారు. మంత్రి మాట్లాడుతూ సీఎం ఆగిరిపల్లిలో చేతివృత్తుల వారు, నాయీ బ్రాహ్మణులు, గొర్రెల కాపరులు, ఇతర చేతి వృత్తుల మీద ఆధారపడి జీవిస్తున్న వారి పని స్థలాలకు వెళ్లి వారి సమస్యలను తెలుసుకుంటారన్నారు. ఎన్ఎస్‌పీ కాల్వను అభివృద్ధి పరిచేందుకు మైనర్ ఇరిగేషన్ రిహాబిలిటేషన్ ప్లాన్‌ను, ఆగిరిపల్లిలోని నరసింహస్వామి ఆలయ అభివృద్ధి, నూజివీడు రింగ్‌రోడ్ ఏర్పాటు తదితర అంశాలను సీఎం దృష్టికి తీసుకెళ్తామన్నారు. కాగా సీఎం పర్యటన నేపథ్యంలో కలెక్టర్ కె.వెట్రిసెల్వి బుధవారం సాయంత్రం నూజివీడు సబ్ కలెక్టర్

(మిగతా 8లో)



కలెక్టర్ వెట్రిసెల్వి, ఎస్పీ కేపీఎస్ కిశోర్, జేసీ ధాత్రి రెడ్డిలతో కలిసి ఏర్పాట్లను పరిశీస్తున్న మంత్రి పార్థసారథి

- సీఎం పర్యటనకు సంబంధించిన షెడ్యూల్ దాదాపు ఖరారైంది. ఆయన సుమారు రెండున్నర గంటల పాటు ఆగిరిపల్లిలో ఉండనున్నారు. శుక్రవారం ఉదయం సుమారు 10 గంటల సమయంలో ఆగిరిపల్లి సమీపంలోని వడ్డమాను వద్ద ఏర్పాటు చేసిన హెలిప్యాడ్ వద్దకు హెలికాప్టర్‌లో చేరుకుంటారు. అక్కడ నుంచి రోడ్డు మార్గం ద్వారా ఆగిరిపల్లి చేరుకుని వివిధ కుల వృత్తులకు సంబంధించిన కుటుంబాలను వారి పని ప్రదేశంలో కలిసి వారి సమస్యలను తెలుసుకుంటా రు. అనంతరం ఆగిరిపల్లి హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన ప్రజావేదిక వద్దకు చేరుకుని ప్రజలను ఉద్దేశించి ప్రసంగిస్తారు. వడ్డమాను రోడ్డులో పార్టీ కార్యకర్తల కోసం ఏర్పాటు చేసిన వేదిక వద్దకు చేరుకుని కార్యకర్తలతో సమావేశమవుతారు. అనం తరం అక్కడ నుంచి హెలిప్యాడ్ వద్దకు చేరుకుని విజయవాడ బయలుదేరి వెళ్తారు.

తూకంలో మోసగిస్తే..



- చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటాం..
- ఎంఆర్‌పీ కంటే అధికంగా అమ్మరాదు
- సమస్యలపై టోల్‌ఫ్రీ నెంబరు 1967కు ఫోన్ చేయండి
- ఆంధ్రజ్యోతి ఫోన్ ఇన్ కార్యక్రమంలో జిల్లా లీగల్ మెట్రాలజీ అసిస్టెంట్ కమిషనర్ బీఎన్‌వీఎస్ ఈశ్వర్ రామ్

ఆంధ్రజ్యోతి ఫోన్ ఇన్

ఏలూరు/ఏలూరు టుటౌన్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి) : నిత్యావసర వస్తువుల తూకాల్లో తేడా, పెట్రోల్ బంకుల్లో కొలతలు తేడా, బంగారం వస్తువుల్లో అసమానతలు, ప్యాకింగ్ వస్తువులు కొనుగోళ్లలో మోసపోతే వినియోగదారులు తూనికలు, కొలతల శాఖ అధికారులు ఆశ్రయిస్తే వారిపై చర్యలు తీసుకుంటామని జిల్లా లీగల్ మెట్రాలజీ అసిస్టెంట్ కంట్రోలర్ బీఎన్‌వీఎస్ ఈశ్వర్‌రామ్ పేర్కొన్నారు. మోస పోయినప్పుడు వినియోగదారులు తూనికలు, కొలతలశాఖ టోల్‌ఫ్రీ నంబర్ 1967కు ఫోన్ చేసి తెలుపవచ్చన్నారు. లీగల్, మెట్రాలజీ యాక్టు 2009, లీగల్ మెట్రాలజీ కమోడీస్ అండ్ ప్యాకేజీస్ యాక్టు 2011 ద్వారా మోసం చేసిన వ్యాపారులపై చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఈ విషయంలో వినియోగ దారులకు అండగా నిలుస్తూ బుధవారం 'ఆంధ్రజ్యోతి ఫోన్ ఇన్ కార్యక్రమం' నిర్వహించింది. జిల్లా నుంచి పలువురు వినియోగదారులు తమ సమస్యలను తెలుపగా ఏసీ ఈశ్వర్ రామ్ వారి సందేహాలను నివృత్తి చేసి, మోసాలకు పాల్పడే వ్యాపారులపై చర్యలు తీసుకుంటామని తెలిపారు.

తూకాల్లో తేడాలు.. అధిక ధరలు

- ఏలూరు అంబికా థియేటర్ సెంటర్లలో బడ్డీ కొట్లు, కిళ్లీ కొట్టుల్లో ప్యాకేజీల్లో ఉన్న తినుబండారాల్లో ఎక్కువగా నిల్వ ఉండి, కాల పరిమితి ముగిసిన తక్కువ బరువు కలిగిన ప్యాకెట్ల అమ్మి మోసం చేస్తున్నారు.

- దుద్దే ఉదయ్‌భాస్కర్, ఏలూరు

ఏసీ : లీగల్ మెట్రాలజీ ఇన్‌స్పెక్టర్లతో తనిఖీలు నిర్వహించి, తక్కువ తూకం, ఎక్స్‌పెయిరీ డేట్ ముగిసిన ప్యాకింగ్ వస్తువులను అమ్మినా, నిల్వ ఉంచినా చర్యలు తీసుకొంటాం.

- మేము ఇండియన్ గ్యాస్ కంపెనీ సిలిండరు వినియోగిస్తున్నాం. సిలెండర్‌లో గ్యాస్ తక్కువ నింపుతున్నట్టు అనుమానంగా ఉంది. సిలెండర్ గతంలో కన్నా తక్కువ రోజులు వస్తోంది. డెలివరీ బాయ్ బిల్లు రేటు కన్నా అదనంగా రూ.30, రూ.40 వసూలు చేస్తున్నారు.

- మస్తాన్‌బీ, సోమవరప్పాడు, దెందులూరు మండలం

ఏసీ : ఇండియన్ గ్యాస్ ఏజన్సీ గొడౌన్‌కు వెళ్లి మా సిబ్బంది త్వరలో తనిఖీలు నిర్వహిస్తారు. మా శాఖ స్టాండర్ వేయింగ్ మెషీన్లు తీసుకెళ్లి

(మిగతా 8లో)



ప్రత్తికోళ్లలంకలో వైద్య శిబిరం

ప్రత్తికోళ్లలంకలో అంతుపట్టని జ్వరాలు

ఏలూరురూరల్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి) : ఏలూరు రూరల్ మండలం ప్రత్తికోళ్ల లంక జ్వరాలతో అల్లాడుతోంది. గతంలో ఎన్నడూ లేనట్టుగా ప్రస్తుతం వస్తున్న జ్వరాలతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. సాధారణంగా జ్వరం ఆరంభమై తీవ్రమైన ఒళ్ళు నొప్పులు, వాపు వంటి లక్షణాలతో జనం ఆందోళన చెందుతున్నారు. వయస్సుతో సంబంధం లేకుండా జ్వరం, తల నొప్పి, గొంతునొప్పి లక్షణాలతో బాధపడుతున్నారు. విపరీతమైన ఎండ, వేడిమి, ఉక్కపోత, అంతలోనే వర్షంతో జ్వరాలు వ్యాపిస్తున్నాయి. ఈ జ్వరాలు వైద్య ఆరోగ్య శాఖకు అంతుపట్టకుండా ఉన్నాయి. తీవ్ర జ్వరంతోపాటు కీళ్ళ నొప్పులు వస్తుండడం చూసి తొలుత చికున్‌గున్యా అనుకున్నారు. ఇంట్లో ఒకరికి వస్తే మరొకరికి వెంటనే సోకుతుండడంతో ఆందోళన చెందుతున్నారు. ప్రతీ ఇంటా జ్వర పీడితులు ఉన్నారు. గ్రామంలోని ప్రస్తుత పరిస్థితిని దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ దృష్టికి వెళ్లడంతో ప్రత్యేక వైద్య శిబిరం ఏర్పాటు

(మిగతా 8లో)

ముగిసిన పది మూల్యాంకనం

ఏలూరు అర్బన్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి) : పదో తరగతి పరీక్షల జవాబు పత్రాల మూల్యాంకనం బుధవారం ముగిసింది. స్థానిక సెయింట్ గ్జేవియర్ హైస్కూలులో ఈనెల 3న ప్రారంభమైన మూల్యాంకనం శిబిరంలో వివిధ జిల్లాల నుంచి రెగ్యులర్, దూరవిద్య విభాగాల్లో మొత్తం 1,82,803 జవాబుపత్రాలు వచ్చాయి. మూల్యాంకనం చేసిన ఉపాధ్యాయ సిబ్బందికి చెల్లించే పారితోషకాన్ని గరిష్ఠంగా 15 రోజుల వ్యవధిలో వారి బ్యాంకు ఖాతాలకు జమ చేస్తామని, టీఏ, డీఏలను బడ్జెట్ నిధులు విడుదలయ్యాక ఇస్తామని జిల్లా విద్యాశాఖవర్గాలు తెలిపాయి. మూల్యాంకనం ముగియడంతో మిగిలివున్న కంప్యూటరీకరణ ప్రక్రియ పూర్తిచేసి ఈ నెలాఖరులోగా ఫలితాలను వెల్లడించడానికి అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.

ముగిసిన జేఈఈ పరీక్షలు

ఆరురోజులపాటు జరిగిన రెండోవిడత జేఈఈ మెయిన్ పరీక్షలు బుధవారం ముగిశాయి. స్థానిక సిద్ధార్థ క్వెస్ట్ సీబీఎస్ఈ పాఠశాలలో చివరిరోజున జరిగిన బీఆర్క్, బీప్లానింగ్ పరీక్షలకు 180 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకోగా 98 మంది హాజరయ్యారు. మొత్తంగా జిల్లాలో 1,436 మంది దరఖాస్తు చేసుకోగా 1,253 మంది హాజరవ్వగా 183 మంది గైర్హాజరయ్యారు.

'కారుమూరి' వ్యాఖ్యలపై

నాయకుల ఫైర్

పోలీస్‌స్టేషన్లలో ఫిర్యాదుల వెల్లువ..

రైతులు బిక్కు బిక్కు

వాతావరణ మార్పులతో ఆందోళన

లోపలి పేజీలో..



నేత్రపర్వం.. శ్రీచక్రస్నానం

బైరాగిమఠంలో ముగిసిన శ్రీరామనవమి ఉత్సవాలు

పెంటపాడు, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కె.పెంటపాడు బైరాగిమఠం గోపాలస్వామి ఆంజనేయస్వామి ఆలయంలో శ్రీరామనవమి ఉత్సవాలు బుధవారంతో ముగిశాయి. ఆలయ అర్చకులు త్రిలోచనదాస్, పూర్ణచంద్రత్రిపాఠిలు స్వామివారికి ఆలయ ప్రాంగణంలో ఉన్న కోనేరులో చక్రస్నానం నిర్వహించారు. సాయంత్రం స్వామివారికి శ్రీపుష్పయాగ పూజలు జరిపారు. ఏర్పాట్లను ఈవో బీవీ.చంద్రశేఖర్, సిబ్బంది పర్యవేక్షించారు.

క్షీరా రామలింగేశ్వరస్వామి ఆలయంలో స్నపనం

పాలకొల్లు అర్బన్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): :పాలకొల్లు క్షీరా రామలింగేశ్వరస్వామి ఆలయంలో మంగళవారం తెల్లవారుజామున జరిగిన కల్యాణోత్సవాల్లో భాగంగా బుధవారం రాత్రి వేద పండితులు స్నపనం నిర్వహించారు. కల్యాణం జరిగిన అనంతరం 3, 4వ రోజులు స్నపన కార్యక్రమం నిర్వహించడం ఆన వాయితీ. స్వామివారి ముందు అష్ట దిక్పాలకులను ఆవాహన చేసి వేద పఠనం చేస్తూ, బలిపీఠాలపై నివేదన చేశారు. ఆలయ అర్చకులు కృష్ణప్ప, పూర్ణయ్య, అనీల్ కుమార్ శర్మ, అభిషేక పండితులు భమిడిపాటి వెంకన్న, మద్దూరి సూరిబాబు పూజా కార్యక్రమాలు నిర్వహించారు.



ప్రత్యేక అలంకరణలో క్షీరా రామలింగేశ్వర స్వామి

పొన్న వాహనంపై తిరుగాడిన వాడపల్లి వెంకన్న

ఆత్రేయపురం, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీదేవి భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి దివ్యకల్యాణ మహోత్సవాలలో భాగంగా మూడోరోజు బుధ వారం స్వామివారి మేలుకొల్పు, గౌతమి నదీ నుంచి తీర్థపు బిందెతో గోదావరి జలాలను తీసుకువచ్చి స్నపన మూర్తులకు అభిషేకం నిర్వహించారు. విశేష అర్చన, నిత్యహోమ ములు, బలిహరణ, ద్రవిడ వేద పారాయణం ఘనంగా నిర్వహించారు. సాయంత్రం వైఖా నస ఆగమ శాస్త్రప్రకారం ఖండవిల్లి రాజేశ్వర వరప్రసాద్‌చార్యులు బ్రహ్మత్వంలో వేదపండితులు ప్రధాన హోమములు, దిగ్దేవత బలిహ రణ, నీరాజన మంత్రపుష్పం నిర్వహించారు. వివిధ సాంస్కృతిక ప్రదర్శనలు భక్తులను ఆకట్టుకున్నాయి. తణుకు సజ్జాపురానికి చెందిన కోలాట ప్రదర్శన విశేషంగా ఆకట్టుకుంది. రాత్రి 7.01 నిమిషాలకు ఉభయ దేవేరులతో స్వామివారు పొన్నవాహ నంపై తిరువీధులలో తిరుగాడారు. ఆలయ ఉప కమిషనరు నల్లం సూర్యచ క్రధరరావు ఏర్పాట్లు నిర్వహించారు. స్వామివారి కల్యాణోత్సవాలలో భాగంగా నాల్గో రోజు గురువారం సదస్యం నిర్వ హించనున్నారు.



గోదావరి జలాలను తీసుకువస్తున్న అర్చకులు



కోలాటం ప్రదర్శించిన తణుకు బృందం

రైతులు బిక్కు బిక్కు



తాడేపల్లిగూడెంలో మబ్బులు కమ్మిన ఆకాశం

వాతావరణ మార్పులతో ఆందోళన
వర్షాలు కురిస్తే మద్దతు ధర దక్కదు

తణుకు రూరల్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి) : వాతావరణంలో చోటుచేసుకున్న మార్పులతో రైతుల్లో ఆందోళన నెలకొంది. మబ్బులు చూసి బిక్కుబిక్కుమంటున్నారు. పంట చేతికొచ్చే సమయంలో అకాల వర్షాలు నట్టేట ముంచుతాయేమోననే ఆందోళన రైతులను వెంటాడుతోంది. రెండు రోజులుగా వాతావరణంలో వచ్చిన మార్పులు, జిల్లాలో అక్కడక్కడ కురిసిన వర్షాలతో రైతులు ఆందోళన చెందుతున్నారు. వారం రోజులుగా కొన్నిచోట్ల వరికోతలు ప్రారంభించారు. రైతులు తమ ధాన్యాన్ని రైస్ మిల్లులకు తరలించే ప్రయత్నం చేస్తుండగా, మరి కొందరు తమ పంటను కోత కోసేందుకు సన్నద్ధమవుతున్నారు. ఈ తరుణంలో మబ్బుల వాతావరణం రైతులకు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నది.

వర్షాలు కురిస్తే నష్టమే

పంట కోతకి వస్తున్న ఈ సమయంలో వర్షాలు కురిస్తే తీవ్రంగా నష్టపోతామని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈరబీ సీజన్‌లో జిల్లాలో ఎక్కువగా 1121 రకం వరి వంగడాన్ని సుమారు 80 శాతం సాగు చేశారు. ఈ రకం చేలో పంట మీద వుండగానే ధాన్యం ఎండిపోతుంది. పంటకోసిన తర్వాత ధాన్యాన్ని ఎక్కువగా ఆరబెట్టాల్సిన అవసరం వుండదని, అదే కోతకు వచ్చిన దశలో వర్షం కురిస్తే ధాన్యం పంటమీదే మొలకవస్తుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.ఈ రబీ సీజన్‌లో సాగుచేసిన వరి వంగడం పీఎల్ 123 పంజాబీ రకం వరి ధాన్యం కోత దశకు వచ్చినా పచ్చిగానే వుంటుందని, పంట కోసిన తర్వాత ప్రభుత్వం నిర్దేశించిన తేమశాతం రావాలంటే ఎండలో ఆరబెట్టాలని రైతులు పేర్కొంటున్నారు. వర్షాలు కురిస్తే ధాన్యం ఎండ బెట్టే వీలుండదని, రైతులకు మద్దతు ధర దక్కక, మిల్లర్లు నిర్దేశించిన ధరనే తీసుకోవలసి వుంటుందని అంటున్నారు.



మండపాకలో ధాన్యం ఆరబెడుతున్న రైతులు

తేమ శాతం సమస్య..

ధాన్యం కొనుగోలుకు సంబంధించి తేమ శాతం చాలా ముఖ్యం. రైతులు పండించిన ధాన్యాన్ని మిల్లర్లకు తరలించే సమయంలో ధాన్యం తేమ శాతం 17 శాతం కంటే తక్కువగా వుండాలని నిబంధనలు వున్నాయి. అయితే ఈ తేమ శాతం నిర్ధారణ గ్రామస్థాయిలో రైతు సేవా కేంద్రం సిబ్బంది నిర్ధారించిన ప్రకారం రైస్‌మిల్లర్లు కొనుగోలు చేయాలని రైతులు కోరుతున్నారు. కొన్నిచోట్ల రైస్ మిల్లుల వద్ద తేమ శాతాన్ని నిర్ధారించడం వల్ల మోసాలు జరుగుతున్నాయని రైతులు పేర్కొంటున్నారు.

రైతుల సంచుల సంగతేంటి ?

గత ప్రభుత్వ హయాంలో రబీ సీజన్‌లో వాతావరణ పరిస్థితుల దృష్ట్యా రైతుల నుంచి తీసుకున్న సంచులను ఇప్పటికీ రైతులకు ఇవ్వలేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత రబీ సీజన్‌లో అకాల వర్షాల కారణంగా రైతులకు గోనెసంచులు కొరతగా వున్నాయని, రైతులు తమ వద్ద గోనెసంచులు వుంటే వాటిని తమకు ఇవ్వాలని అప్పటి వ్యవసాయ శాఖాధికారులు రైతుల వద్ద నుంచి సంచులను తీసుకున్నారు. అలా ఒక్క తణుకు రూరల్ మండలం దువ్వ సొసైటీ నుంచే ఐదు వేల సంచులను తీసుకున్నారని, జిల్లా మొత్తం మీద సుమారు లక్ష గోనె సంచులు తీసుకున్నా ఇప్పటి వరకూ ఒక్క సంచీ కూడా వెనక్కి ఇవ్వలేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

- **కొనుగోలు కేంద్రాలతో మద్దతు ధర**



వారం రోజుల నుంచి వరి పంట కోతలు జరుగుతున్నాయి. రెండు రోజుల వరకూ పీఎల్ 126 రకం ధాన్యాన్ని రైస్ మిల్లర్లు మద్దతు ధర.75 కేజీలకు రూ. 1400 వుండగా తేమ పేరుతో మిల్లర్లు రూ. 1270, 1300 మాత్రమే చెల్లించేవారు. మండపాక, దువ్వ, వేల్పూరు గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ప్రభుత్వ ప్రకటించిన విధంగా మద్దతు ధరకు ధాన్యం కొనుగోలు చేస్తున్నారు.

-చంద్రు గణేష్, రైతు మండపాక

- **గోనె సంచులు తిరిగి ఇవ్వాలి**



గత రబీ సీజన్‌లో వర్షాల కారణంగా రైస్ మిల్లర్ల వద్ద గోనెసంచుల కొరత వుందని, రైతుల వద్ద సంచులతో ధాన్యం ఇస్తే సీజన్ ముగియగానే అందజేస్తామని అప్పటి వ్యవసాయాధికారులు మా నుంచి సంచులు తీసుకున్నారు. వాటిని వెనక్కి రైతులకు అందజేస్తే ప్రస్తుత సీజన్‌లో రైతులకు ఉపయోగంగా వుంటుంది. దువ్వ సొసైటీ పరిధిలో రైతులందరూ అప్పుడు ఐదు వేల గోనె సంచులను అందించాం. అవి ఎక్కడున్నాయో అధికారులే చెప్పాలి.

-సీహెచ్ రామ్మోహన్, రైతు, మండపాక

- **మద్దతు ధరకు కొనవలసిందే**

రైతులు పండించిన ధాన్యానికి ప్రభుత్వం సాధారణ రకం ధాన్యానికి క్వింటాకు రూ.1700, ఏ-గ్రేడ్‌కు రూ.1730 ప్రభుత్వం ప్రకటించింది. తేమశాతం 17 శాతం కంటే తక్కువ వున్న ధాన్యానికి ప్రభుత్వం ప్రటించిన విధంగా మద్దతు ధర చెల్లిస్తారు. గత ప్రభుత్వ హయాంలో రైతుల నుంచి గోనెసంచులు సేకరించిన విషయం నాకు తెలియదు.

-జెడ్ వెంకటేశ్వరరావు, పశ్చిమ గోదావరి జిల్లా వ్యవసాయాధికారి, భీమవరం



పట్టిసీమలో కల్లాల్లో ఉన్న మొక్కజొన్న ఒబ్బిడి చేస్తున్న రైతు

ఈదురుగాలులు.. భారీ వర్షం

పోలవరం/ ఉంగుటూరు/ తాడేపల్లిగూడెం రూరల్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి) : పోలవరం మండలంలో బుధవారం సాయంత్రం ఈదురు గాలులు ఉరుములు, మెరుపులతో భారీ వర్షం కురిసింది. ఈదురు గాలులకు పోలవరం నుంచి కన్నాపురం వెళ్లే రోడ్డుమార్గంలో చెట్లు కూలి వాహనాల రాకపోకలకు అంతరాయం కలిగింది. పోలవరం మెయిన్ బజారులో వర్షం నీరు నిలిచి రాకపోకలకు ప్రజానీకం ఇబ్బందులకు గురయ్యారు. విద్యుత్ సరఫరా నిలిపివేశారు. పోలవరం మండలంలో పట్టిసీమ, ఇటుకలకోట, కొత్తపట్టిసీమ, గూటాల, ప్రగడపల్లి, ఎల్లండీ పేట గ్రామాల్లో కల్లాలలో ఆరబెట్టిన మొక్కజొన్న పంట తడిసింది. ఈదురు గాలులకు లేతగా నాటుకున్న మొక్కజొన్న, వరిపంటలు నేలవాలాయి. ఉంగుటూరు మండలంలో బుధవారం రాత్రి వర్షం కురిసింది. దీంతో రైతులు కోసిన వరి పంటను కాపాడుకునేందుకు పరుగులు తీశారు. తాడేపల్లిగూడెం ప్రాంతంలో నల్లటి కారుమబ్బులు కమ్మేసి ఈదురు గాలులు వీయడంతో రైతుల గుండెల్లో రైళ్లు పరుగెట్టాయి.



ఉంగుటూరులో వర్షం



ప్రకృతి గొడుగు

నిప్పులు చెరుగుతున్న మండు వేసవిలో సైతం ఈ మార్గం చల్లదనాన్ని పంచుతోంది. పచ్చదనంతో ఆహ్లాదం ఇవ్వడంతో పాటు ఎండవేడిమి నుంచి ప్రయాణికులు ఊరట పొందుతున్నారు. ద్వారకా తిరుమల మండలం **రామన్నగూడెం నుంచి వెంకట కృష్ణాపురం వెళ్లే రహదారి, దొరసానిపాడు నుంచి ఈస్టు యడవల్లికి వెళ్లే రహదారికి** ఇరువైపులా చెట్లు ఇలా ప్రయాణికులకు గొడుగు పడుతున్నాయి.

-ద్వారకాతిరుమల (ఆంధ్రజ్యోతి)





విజేతలకు ప్రశంసాపత్రాలను అందజేస్తున్న ఇండియా కబడ్డీ క్రీడాకారిణి రీతు నేగి, తదితరులు

విద్యార్థులు క్రీడల్లో రాణించాలి

తాడేపల్లిగూడెం అర్బన్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని అర్జున అవార్డు గ్రహీత, ఇండియా కబడ్డీ క్రీడాకారిణి రీతు నేగి అన్నారు. బుధవారం ఏపీ నిట్‌లో ఫిజికల్ ఎడ్యుకేషన్ క్లబ్ ఆధ్వర్యంలో ఘనంగా క్రీడా దినోత్సవం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన రీతు నేగి మాట్లాడుతూ విద్యార్థులు క్రీడల్లో రాణించి అంతర్జాతీయ స్థాయికి ఎదగాలన్నారు. తాను 17 సంవత్సరాలుగా కబడ్డీ ఆడుతున్నానని దేశం తరఫున ఆడుతున్నందుకు గర్విస్తున్నానన్నారు. 2022న జరిగిన ఆసియా క్రీడలలో భారతీయ కబడ్డీ జట్టుకు కెప్టెన్‌గా వ్యవహరించడంతో పాటు స్వర్ణ పతకాన్ని సాధించడం ఆనందాన్ని ఇచ్చిందన్నారు. ఆంధ్రా కబడ్డీ అసోసియేషన్ కార్యదర్శి శ్రీకాంత్ మాట్లాడుతూ విద్యార్థులు సెల్‌ఫోన్‌లకే పరిమితం కాకుండా కొంత సమయాన్ని క్రీడలకు కేటాయిస్తే శారీరక ఆరోగ్యాన్ని పెంపొందిచుకోవచ్చునన్నారు. కబడ్డీ క్రీడాకారిణి పింకి రాయ్ మాట్లాడుతూ విద్యార్థులు క్రీడలపై మక్కువతో సాధన చేస్తే ప్రతిఫలం తప్పక దక్కుతుందన్నారు. అనంతరం ఏపీ నిట్ రిజిస్ట్రార్ డాక్టర్ పి.దినేష్‌శంకర్‌రెడ్డి అతిథులను శాలువా, మెమొంటోలతో సత్కరించారు. పలు క్రీడల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు ప్రశంసా పత్రాలను అందజేశారు. డీన్‌లు డాక్టర్ రవికిరణ్‌శాస్త్రి, డాక్టర్ కే.హిమబిందు, డాక్టర్ జీబీ వీరేష్‌కుమార్, అసోసియేట్ డీన్‌లు డాక్టర్ శ్రీనివాసన్, డాక్టర్ రాజేశ్వరరెడ్డి, డాక్టర్ కిరణ్ తీపర్తిలు పాల్గొన్నారు.

ఇస్రోలో శిక్షణకు ఎంపికైన దండగర్ర విద్యార్థినులు

తాడేపల్లిగూడెం రూరల్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): భారతీయ అంతరిక్ష పరిశోధనా సంస్థ (ఇస్రో), ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ రిమోట్ సెన్సింగ్ (ఐఐఆర్ఎస్) ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా యువ శాస్త్రవేత్తలకు నిర్వహించే శిక్షణ కార్యక్రమానికి దండగర్ర జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థినులు ఎంపికయ్యారు. వీరు మే 18 నుంచి 31 వరకూ శ్రీహరికోటలోని సతీష్ ధావన్ స్పేస్ సెంటర్‌లో నిర్వహించే శిక్షణకు హాజరవుతారని హెచ్ఎం సీహెచ్ చంద్రశేఖర్ బుధవారం తెలిపారు. దేశవ్యాప్తంగా లక్షా 50 వేల మంది విద్యార్థులు ఈ శిక్షణ కోసం దరఖాస్తు చేసుకోగా వారిలో 350 మంది ఎంపికయ్యారు దండగర్ర ఉన్నత పాఠశాల నుంచి సెలెక్ట్ అయిన తొమ్మిదో తరగతి విద్యార్థినులు షైనం ప్రదీప్తి, వీరమళ్ల పద్మశ్రీలను ఉపాధ్యాయులు అభినందించారు.





కోకో రైతుల సంఘం సమావేశంలో పాల్గొన్న నాయకులు

సమస్యల పరిష్కారానికి కోకో రైతుల ఆందోళన బాట

పెదవేగి, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి) : కోకో గింజలు కొనుగోలు, ధర సమస్య పరిష్కరించక పోవడం పట్ల కోకో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని ఆంధ్రప్రదేశ్ కోకో రైతుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.శ్రీనివాస్ తెలిపారు. పెదవేగి మండలం విజయరాయి సీతారామ కల్యాణ మండపంలో ఆంధ్రప్రదేశ్ కోకో రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బొల్లు రామకృష్ణ అధ్యక్షతన కోకో రైతుల సంఘం రాష్ట్ర సమావేశం బుధవారం నిర్వహించారు. కోకో గింజల కొనుగోలు కంపెనీల మోసాలు, ధరలు తగ్గింపుపై ఈనెల 15న కోకో రైతుల ఛలో గుంటూరు, 12న కోకో సాగు చేస్తున్న అన్ని జిల్లాల్లో రాస్తారోకోలు నిర్వహించేందుకు రాష్ట్ర సమావేశం తీర్మానించింది. ఈనెల 7వ తేదీ నాటికి ధరల ఒప్పంద నిర్ణయం ప్రకటిస్తామని వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడు చెప్పినా ఇంత వరకు ధరల ఒప్పందం ప్రకటన చేయలేదన్నారు.

శక్తి.. వేధింపుల నుంచి విముక్తి



ఆపద సమయంలో, లైంగిక వేధింపులకు గురయ్యే పరిస్థితులు ఎదురైన సమయంలో బాలికలు, యువతులు, మహిళలు తమను తాము రక్షించుకునేందుకు, క్షణాల్లో పోలీస్ సహాయం పొందేందుకు వీలుగా రాష్ట్ర ప్రభుత్వం శక్తి యాప్‌ను రూపొందించింది. ప్రతి మహిళ తమ మొబైల్ ఫోన్‌లో ఈ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించింది. ఈ యాప్‌పై మహిళల్లో ముఖ్యంగా బాలికలలో అవగాహన కలిగించేలా ప్రభుత్వం చర్యలు చేపట్టింది.

భీమవరం క్రైం/లింగపాలెం (ఆంధ్రజ్యోతి)

మహిళలు, బాలికల భద్రతకు రక్షణ.. శక్తి యాప్
ఆపద సమయాల్లో అండగా పోలీస్ ఉన్నట్లే..
పశ్చిమలో 30 మందితో శక్తి టీమ్ ఏర్పాటు
మహిళలపై పెరుగుతున్న నేరాలకు అడ్డుకట్ట

శక్తి యాప్‌తో ప్రయోజనాలు



- మహిళలు ఆపదలో ఉన్నప్పుడు శక్తి యాప్‌లోని ఎస్‌వోఎస్ (సేవ్ అవర్ సోల్స్) ఆప్షన్ నొక్కితే వారి లొకేషన్ వీడియో, ఆడియో కంట్రోల్ రూమ్‌కు చేరుతుంది. పోలీస్ స్టేషన్‌కు వెళ్లకుండానే ఫిర్యాదు అందుతుంది. ఫోన్ ఊపినా కూడా సమాచారం పోలీసులకు చేరుతుంది.
- ఒంటరిగా ప్రయాణిస్తున్న మహిళలు (సేఫ్ ట్రావెల్) ఆప్షన్ ద్వారా వాహన నంబర్, ప్రయాణ మార్గాన్ని షేర్ చెయ్యవచ్చు. పోలీస్ కంట్రోల్ రూమ్ వాహనాన్ని ట్రాక్ చేస్తుంది. మార్గం తప్పితే వెంటనే స్పందిస్తుంది.
- లైంగిక వేధింపులు, కలహాలు, గృహహింస, సైబర్‌క్రైమ్స్, ఫొటో మార్ఫింగ్, పరువు హత్యలు.. ఏ నేరాల గురించి అయినా (గెట్ ఏ కంప్లయింట్) ఆప్షన్ ద్వారా ఫిర్యాదు చెయ్యవచ్చు.
- భర్త వేధింపులు, గృహహింస వంటి సమస్యలకు ఫ్యామిలీ కౌన్సెలింగ్ సేవలు పొందే వీలుంటుంది. అదృశ్యమైన పిల్లల సమాచారం అందజేసి పోలీసుల సహాయం తక్షణమే పొందవచ్చు.
- అప్రమత్తత కోసం కుటుంబ సభ్యులు లేదా స్నేహితుల ఐదు ఫోన్ నంబర్లు ఈ యాప్‌లో నమోదు చేసుకోవచ్చు. ఆపద సమయంలో (ఎస్‌వోఎస్) నొక్కిన వెంటనే సమాచారం చేరవేయబడుతుంది.
- మహిళల వేధింపులే కాకుండా బహిరంగ మద్యపానం, మాదక ద్రవ్యాల వినియోగం, చీకటి ప్రదేశాల్లో అసాంఘిక కార్యకలాపాలు, ఈవ్ టీజింగ్ వంటి అంశాలపై కూడా ఫిర్యాదు చెయ్యవచ్చు.
- అత్యవసర సమయంలో నైట్ షెల్టర్స్‌లలో వన్‌స్టాప్ సెంటర్ల నందు ఆవాసం పొంది ఉదయాన్నే వెళ్ళవచ్చు.సిబ్బంది విధుల పట్ల అప్రమత్తంగా ఉంటూ ఆయా పరిధిలో ఉన్న ప్రతి సమస్యను సామరస్యంగా పరిష్కరించేలా ఈ యాప్ ఎంతగానో సహకరిస్తుంది.

వేగంగా యాప్ డౌన్‌లోడ్

జిల్లాలో అత్యంత వేగంగా శక్తి యాప్ డౌన్‌లోడ్ జరుగుతుంది. రాష్ట్రంలోనే రెండవ జిల్లాగా పశ్చిమ గోదావరి నిలిచింది. భీమవరం పట్టణంలో టూటౌన్ సీఐ కాళీచరణ్ ఆధ్వర్యంలో కళాశాలలు, పాఠశాలల వద్ద కౌన్సెలింగ్ నిర్వహించి విద్యార్థినులకు అవగాహన కల్పిస్తున్నారు..

మహిళల భద్రతే లక్ష్యం : పశ్చిమ ఎస్పీ నయీం అస్మి



రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన శక్తి యాప్, శక్తి టీమ్‌లు మహిళల భద్రతకు ఎంతగానో ఉపయోగపడుతుంది. ఆపదలో ఉన్న మహిళలకు రక్షణ కల్పించడమే పోలీసు శాఖ లక్ష్యం. ప్రతీ మహిళ శక్తి యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలి. ఆపద సమయంలో ఉపయోగించుకుంటే మహిళలపై దాడులు తగ్గుతాయి.

అవగాహన కల్పిస్తున్నాం



మహిళలపై జరుగుతున్న ఆకతాయిల వేదింపులు, దాడుల నుంచి తమను తాము కాపాడుకునేందుకు శక్తియాప్ రక్షణ కవచం లాంటిది. స్కూల్స్, కాలేజీలలో చదువుకుంటున్న బాలికలకు ఈ యాప్‌పై అవగాహన కల్పిస్తున్నాం. ఆపద ఎదురైనప్పుడు ఎస్ఓఎస్ బటన్ ప్రెస్ చేస్తే చాలు లోకేషన్ ఆధారంగా వారిని గుర్తించి రక్షించేందుకు ఎప్పుడూ పోలీసులు సిద్ధంగా ఉంటారు.

రవిచంద్ర, జంగారెడ్డిగూడెం డీఎస్పీ

శక్తి టీమ్‌ల నిఘా

మహిళల భద్రత కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసు కుంటున్నది. ముఖ్యంగా మహిళలపై జరిగే నేరాలకు అడ్డుకట్ట వేసేందుకు మహిళల భద్రతకు భరోసాగా ఇటీవల పోలీస్ శాఖ శక్తి బృందాలను అందుబాటులోకి తీసుకువచ్చింది. ఆరుగురు మహిళా సభ్యులతో ఐదు బృందాలను మొత్తం 30 మందితో పశ్చిమ గోదావరి జిల్లాలో టీమ్‌ను ఏర్పాటు చేసింది. జిల్లా పోలీస్ కార్యాలయంలో రెండు బృందాలు, మూడు సబ్ డివిజన్‌లలో మూడు బృందాలను ఏర్పాటు చేసింది. కళాశాలలు, పార్కులు, ఆర్టీసీ బస్టాండ్ల వద్ద మఫ్టీలో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేస్తున్నారు. శక్తి టీమ్స్ మహిళలపై వేధింపులు అరికట్టడం, నేరాలు నిరోధించడం తక్షణ సాయం అందించి వారికి రక్షణ కవచంలా పని చేస్తారు. శక్తి యాప్‌కు వచ్చే ఎస్ఓఎస్ కాల్స్ డయల్ 112/100 కాల్స్‌తో సంఘటనా స్థలానికి టీమ్స్ వెళ్తాయి. సమస్యను చట్టబద్ధంగా పరిష్కారమయ్యేలా చర్యలు చేపట్టనున్నారు.



పశ్చిమలో ఏర్పాటైన శక్తి టీమ్ సభ్యులు (ఫైల్‌ఫొటో)

మే 10న జాతీయ లోక్ అదాలత్


మాట్లాడుతున్న రత్న ప్రసాద్

ఏలూరు క్రైం, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి):ఉమ్మడి పశ్చిమ జిల్లాలోని అన్ని కోర్టులలో మే పదో తేదీన జాతీయ లోక్అదాలత్ నిర్వహిస్తున్నామని డీఎల్ఎస్ఏ కార్యదర్శి కె.రత్నప్రసాద్ తెలిపారు. జిల్లా కోర్టు ఆవరణలోని డీఎల్ఎస్ఏ భవనంలో బుధవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 2025లో నాలుగు జాతీయ లోక్అదాలత్‌లు నిర్వహిస్తున్నామని దానిలో భాగంగా రెండో లోక్ అదాలత్ మే పదో పదిన నిర్వహిస్తున్నామన్నారు. రాజీకి ఆమోదయోగ్యమైన అన్ని క్రిమినల్ కేసులు, సివిల్‌కేసులు, కుటుంబ వివాదాల కేసులు, చెక్‌బౌన్స్ కేసులు, టెలిఫోన్ బకాయిలు, తదితర కేసులను జాతీయ లోక్ అదాలత్‌లో పరిష్కరిస్తామన్నారు. అన్నికోర్టుల పరిధిలో ప్రీసిట్టింగ్ లోక్అదాలత్‌లు నిర్వహిస్తున్నామని కక్షిదారులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు. ఈ ఏడాది మొదటి జాతీయ లోక్ అదాలత్‌లో 5,236 కేసులు రాజీ చేశామన్నారు. కేసు పరిష్కారంలో ఏమైనా సమస్యలుంటే 15100కు కాని 08812- 22455కు ఫోన్ చేసి పరిష్కరించుకోవచ్చన్నారు.


ఉండిలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించి జెండా ఊపుతున్న డిప్యూటీ స్పీకర్ రఘురామ

ధాన్యం కొనుగోలు బాధ్యత నాదే : డిప్యూటీ స్పీకర్

ఉండి, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): దాళ్వా పంటకు సంబంధించి రైతులు పండించిన ధాన్యాన్ని కొనుగోలు చేయించే బాధ్యత తనదేనని, రైతులు ఆందోళన చెందనవసరం లేదని డిప్యూటీ స్పీకర్ కనుమూరు రఘురామకృష్ణరాజు హామీ ఇచ్చారు. బుధవారం ఉండి వ్యవసాయ మార్కెట్ యార్డులో ఏవో సంధ్య అధ్యక్షతన రైతులకు ప్రభుత్వం సబ్సిడీపై ఇచ్చే యంత్రాలు, ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని, ధాన్యం బస్తాలు తీసుకొచ్చిన ట్రాక్టరును జెండా ఊపి ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ గత వైసీపీ హయాంలో రైతులు ఎన్నో అవస్థలు ఎదుర్కొన్నారని, ఇప్పుడు రైతులు తమకు నచ్చిన రైస్ మిల్లులకు ధాన్యాన్ని తరలించి 48 గంటల్లోపై రైతు ఖాతాల్లోకి నగదు జమ అయ్యేలా చర్యలు చేపట్టామని గుర్తుచేశారు. రైతులకు రాయితీపై పవర్ స్ప్రేయర్లును, పవర్ టిల్లర్లు, బ్యాటరీ స్ప్రేయర్లను సబ్సిడీపై అందించారు. 40 క్వింటాళ్ల పెసలు, 50 క్వింటాళ్ల మినుములను సబ్సిడీపై రైతులకు అందించారు. కార్యక్రమంలో కునాధరాజు మురళీకృష్ణంరాజు, ఉండి జనసేన ఇన్‌చార్జి జుత్తుగ నాగరాజు, ఉండి డీసీ చైర్మన్ మంతెన సాయిలచ్చిరాజు, పొత్తూరి వెంకటేశ్వరరాజు, తదితరులు పాల్గొన్నారు.

సెలవు కావాలంటే వెయ్యి ఇవ్వాలట..!

శానిటరీ ఇన్‌స్పెక్టర్‌పై పారిశుధ్య కార్మికుడి ఫిర్యాదు


ఫిర్యాదును చూపిస్తున్న కోలా వెంకటేశ్వరరావు

జంగారెడ్డిగూడెం, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): జంగారెడ్డిగూడెం మున్సిపాలిటీలో శానిటరీ ఇన్‌స్పెక్టర్‌పై పారిశుధ్య కార్మికుడు కోలా వెంకటేశ్వరరావు ఎమ్మెల్యే రోషన్‌కుమార్‌కు ఫిర్యాదు చేశాడు. బుధవారం మున్సిపల్ కార్యాలయం వద్ద జరిగిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో వినతి పత్రం అందజేశారు. కార్మికులు సెలవు పెడితే సదరు శానిటరీ ఇన్‌స్పెక్టర్‌కు వెయ్యి రూపాయలు ఇచ్చుకోవాల్సి వస్తోందన్నారు. లేదంటే సెలవు పెడితే జీతం కట్ అయ్యేలా చేస్తున్నారంటూ అతడు ఫిర్యాదులో పేర్కొన్నారు. విధుల నిర్వహణలో భాగంగా తనపై తొమ్మిదేళ్లుగా ఒత్తిడికి గురిచేస్తున్నారని, నచ్చిన కార్మికుల దగ్గర వెయ్యి రూపాయలు తీసుకుని ఎన్ని రోజులు విధులకు రాకపోయినా హాజరు వేస్తున్నాడన్నారు. ప్రతీనెలా పారిశుధ్య కార్మికుల దగ్గర రూ.25 వేలు ఇదే తరహాలో వసూలు చేస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నాడు. అద్దె ఇంట్లో ఉంటూ బిడ్డలను చదివించుకుంటున్న తనకు న్యాయం చేయాలని ఫిర్యాదులో పేర్కొన్నాడు.

'ఆవకాయ' అన్నమే దిక్కు

» నూజివీడు జడ్పీ బాలికోన్నత పాఠశాలలో పరిస్థితి


నూజివీడు పాఠశాలలోని మధ్యాహ్నం భోజనంలో ఆవకాయ పచ్చడి వేసిన దృశ్యం

నూజివీడు టౌన్, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): పౌష్టికాహారం అందిస్తున్నామని ప్రభుత్వాలు చెబుతున్న పాఠశాలల్లో అందించే మధ్యాహ్న భోజన పథకంలో మాత్రం 'పచ్చడి మెతుకులే దిక్కు' అనే పరిస్థితి ఉందనేందుకు నూజివీడు జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో నెలకొన్న పరిస్థితులే నిదర్శనం. బుధవారం బాలికోన్నత పాఠశాలలో పూర్తిగా నాసిరకంగా ఆహారాన్ని వండి అందులో కాయగూరలకు బదులుగా 'ఆవకాయ పచ్చడి వేసి దీంతోనే సరిపెట్టుకోండి' అంటూ భోజన పథకం నిర్వాహకులు వ్యవహరించడంతో పిల్లలు నిర్ఘాంతపోవాల్సి వచ్చింది. మెత్తబడిన అన్నాన్ని మండు వేసవిలో పచ్చడితో తింటూ తమ బాధను తల్లిదండ్రులకు తెలపడంతో పాఠశాలలో నాసిరకపు భోజనం అందించే పరిస్థితి బయటకు వచ్చింది. ఇప్పటికైనా అధికారులు స్పందించి చిన్నారులకు పౌష్టికాహారం అందించాలని తల్లిదండ్రులు కోరుతున్నారు. కాగా బాలికోన్నత పాఠశాలలో మొత్తం 550 మంది విద్యార్థులకు గాను మెనూ ప్రకారం బుధవారం సాంబారు అన్నం ఇవ్వాలి. అయితే విద్యార్థులకు పూర్తిస్థాయిలో సాంబారు సరిపోకపోవడంతో 20 మందికి ఆవకాయ పచ్చడి వేసినట్టు విద్యార్థులు తెలుపుతున్నారు.

తాడేపల్లిగూడెం హోటళ్లలో విజిలెన్స్ తనిఖీలు


తాడేపల్లిగూడెంలోని హోటల్‌లో తనిఖీలు చేస్తున్న విజిలెన్స్ అధికారులు

తాడేపల్లిగూడెం రూరల్, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): తాడేపల్లిగూడెం పట్టణంలోని హోటల్స్‌లో విజిలెన్స్, ఫుడ్ సేఫ్టీ అధికారులు బుధవారం తనిఖీలు నిర్వహించారు. ఫుడ్ సేఫ్టీ అధికారి సుందరరామిరెడ్డి, విజిలెన్స్ ఎస్ఐ రంజిత్ పట్టణంలోని ఫుడ్‌వేవ్స్, అన్‌లిమిటెడ్, డాల్ఫిన్ హోటళ్లలో తనిఖీలు చేశారు. ఈ తనిఖీల్లో ఫ్రిజ్‌లలో నిల్వ ఉంచిన మాంసం, మరగకాగిన ఆయిల్స్ ఇతర వంటలకు ఉపయోగించే పదార్థాల శాంపిల్స్ తీసుకుని ల్యాబ్‌కు తరలించారు. కార్యక్రమంలో ఆయా హోటళ్ల యజమానులకు పలు సూచనలు చేశారు.

నోరు అదుపులో పెట్టుకో

» రెడ్డి అప్పలనాయుడు హెచ్చరిక



ఏలూరురూరల్ : చట్టబద్ధంగా పని చేస్తున్న పోలీసులను మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి, ఇంట్లోంచి లాగేస్తాం.. నరికేస్తామంటూ మాజీ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు ఇష్టానుసారంగా మాట్లాడితే ఊరుకునేదిలేదని ఆర్టీసీ విజయవాడ జోనల్ చైర్మన్ రెడ్డి అప్పలనాయుడు హెచ్చరించారు. నోరు అదుపులో పెట్టుకోవాలని సూచించారు. జగన్మోహన్‌రెడ్డి చేతనైతే తన చెల్లి, తల్లితోపాటు చిన్నాన్న కూతురు సునీత కన్నీళ్లు తుడవాలని, వారికి న్యాయం చేయాలని సూచించారు. చట్టబద్ధంగా పనిచేస్తున్న పోలీసులను, ప్రభుత్వంపై ఇష్టారాజ్యంగా మాట్లాడితే చర్యలు తప్పని హెచ్చరించారు. జగన్, కారుమూరి వ్యాఖ్యలను సుమోటాగా తీసుకుని కేసులు నమోదు చేయాలన్నారు.

సుమోటోగా కేసులు నమోదు చేయాలి : గన్ని



బుట్టాయగూడెం : రాష్ట్రంలో శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తున్న వైఎస్ జగన్మోహనరెడ్డి, మాజీ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు వ్యాఖ్యలను సుమోటోగా కేసులు నమోదుచేసి అరెస్టు చేయాలని టీడీపీ ఏలూరు జిల్లా అధ్యక్షుడు గన్ని వీరాంజనేయులు ప్రభుత్వాన్ని కోరారు. బుధవారం బుట్టాయగూడెంలో ఏపీ ట్రైకార్ చైర్మన్ బొరగం శ్రీనివాసుతో కలిసి విలేకరులతో ఆయన మాట్లాడారు. మాజీ ముఖ్యమంత్రి జగన్ అసభ్యకరంగా మాట్లాడుతున్నారని, చనిపోయినవారిని ఓదార్పు పేరుతో పర్యటిస్తూ రాష్ట్రంలో శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తున్నారన్నారు. ప్రతిపక్ష హోదా కూడా లేని జగన్ పర్యటనకు ప్రభుత్వం 1100 మంది పోలీసులతో భద్రత కల్పించినట్లు తెలిపారు. వైసీపీ చేస్తున్న అసత్య ప్రచారాన్ని ఖండించారు.



'కారుమూరి' వ్యాఖ్యలపై నాయకుల ఫైర్

వైసీపీ నేత, మాజీ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు సహనం కోల్పోయారు. ఆ పార్టీ అధికారంలో మంత్రిగా ఉన్నప్పుడు రైతులను ఎర్రి పప్ప అని సంబోధించి.. దానికి బుజ్జి కన్నా అని కొత్త నిర్వచనం ఇచ్చారు. తాను ఓటమి పాలైనా ఇప్పుడూ నోరు పారేసుకున్నారు. ఏలూరులో మంగళవారం నిర్వహించిన వైసీపీ కార్యకర్తల సమావేశంలో వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. 'వైసీపీ నాయకులను వేధించిన టీడీపీ నాయకులను గుర్తు పెట్టుకుంటాం. గుంటూరు ఇవతల ఉన్న వాళ్లను ఇంట్లో నుంచి లాగికొడతారు. గుంటూరు అవతల ఉన్న వారిని నరికి పారేస్తారు' అంటూ రెచ్చగొట్టేలా మాట్లాడారు. దీనిపై కూటమి నాయకులు అంతే ఘాటుగా స్పందించారు.
- ఏలూరురూరల్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి) :


తణుకులో విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎస్సీ, బీసీ సెల్ నాయకులు

తణుకు: మాజీ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు వల్ల తమకు ప్రాణహాని ఉందని టీడీపీ నాయకులు ఆందోళన వ్యక్తం చేశారు. బుధవారం టీడీపీ క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరులు సమావేశంలో ఏఎంసీ చైర్మన్ కొండేటి శివ మాట్లాడుతూ ఏలూరులో జరిగిన వైసీపీ కార్యక్రమంలో టీడీపీ నాయకులను ఉద్దేశించి మాట్లాడారని, ఆయన వ్యాఖ్యలపై తక్షణమే పోలీసులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మాజీ మంత్రిగా నియోజకవర్గంలో దోపిడీ ఏ మేరకు చేశారో ప్రజలందరికీ తెలుసునని అన్నారు.



మా జోలికొస్తే.. తాటతీస్తాం

» బొమ్మిడి నాయకర్ స్ట్రాంగ్ కౌంటర్

నరసాపురం : 'ఒరేయ్ నా కొడకా.. కారుమూరి ఒళ్లు దగ్గర పెట్టుకో.. పద్ధతి మాట తీరు మార్చుకో.. కూటమి నాయకులు, కార్యకర్తల జోలికి వస్తే తాట తీస్తామంటూ' మాజీ మంత్రి కారుమూరి నాగేశ్వరరావుకు ప్రభుత్వ విప్ బొమ్మిడి నాయకర్ మాస్ వార్నింగ్ ఇచ్చారు. ఏలూరులో టీడీపీ నాయకులపై చేసిన వ్యాఖ్యలను ఖండిస్తూ.. పశ్చిమ గోదావరి జిల్లా నరసాపురం మండలం లక్ష్మణేశ్వ రంలో జరిగిన సభలో స్ట్రాంగ్ కౌంటర్ ఇచ్చారు. పద్ధతి, భాషా మార్చుకోవాలని లేకపోతే గుణపాఠం చెబుతా మని హెచ్చరించారు. మీ పాలనలో దాడు లు, పోలీస్ కేసులు భరించాం.. ఇప్పుడు కూడా ఇంకా అధికారంలో ఉన్నట్లు వ్యవహరిస్తు న్నారు. మాజీ మంత్రి అంబటి రాంబాబు, మీరు మాటతీరు మార్చుకోవాలి, లేకపోతే మీ నియోజకవర్గానికి వచ్చి మీ కార్యకర్తల ముందే బుద్ధి చెబుతామని హెచ్చరించారు.

పోలీస్‌స్టేషన్లలో ఫిర్యాదుల వెల్లువ..

తణుకు/ఏలూరు క్రైం : మాజీ మంత్రి కారుమూరి నాగేశ్వరరావుపై తణుకు నియోజకవర్గంలోని పలు పోలీ స్టేషన్లలో బుధవారం ఎస్సీ, బీసీ నాయకులు ఫిర్యాదు చేశారు. నరికేస్తామని, ఇంట్లోంచి లాగి కొడతా మంటూ చేసిన వ్యాఖ్యలు పట్ల ఆందోళనకరంగా ఉందని, కేసు నమోదు చేసి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పట్టణ పోలీసు స్టేషన్‌లో టీడీపీ రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి డాక్టర్ దొమ్మేటి వెంకట సుధాకర్, గుబ్బల శ్రీనివాసు, ఎస్సీల నుంచి చదవలవాడ నాని, అబ్బదాసరి లాజర్, రూరల్ పోలీసుస్టేషన్ పరిధిలో కొండేటి శివ, చుంచుల వెంకటేశ్వరావు, అత్తిలి స్టేషన్‌లో వరి శ్రీను, కడలి రామాంజనేయులు, ఆల్తి సత్యనారాయణ, నీతిపూడి శ్రీనివాసు, మెంతే రాజకుమార్, ఇరగవరం మండలంలో చుక్కా సాయిబాబు, సోడే సంజీవ రావు, నాగేశ్వరరావు, రాంబాబు, గూడూరి నాగరాజు ఆయా స్టేషన్లలో ఫిర్యాదు చేశారు.

ఏలూరులో కారుమూరి, జేపీలపై ఫిర్యాదులు

టీడీపీ కార్యకర్తల మనోభావాలు దెబ్బతినే విధంగా ఏలూరులో వ్యాఖ్యలు చేసిన మాజీ మంత్రి నాగేశ్వరరావు, ఏలూరు వైసీపీ నియోజకవర్గ కన్వీనర్ మామిడిపల్లి జయప్రకాష్‌పై(జేపీ)లపై పోలీసులకు పలువురు ఫిర్యాదులు చేశారు. మామిడిపల్లి జయప్రకాష్ ఇదేవిధంగా వ్యాఖ్యలు చేయడంతో వీరిద్దరిపై టీడీపీ ఎస్సీ, ఎస్టీ సెల్ నాయకుడు, మాల కార్పొరేషన్ డైరెక్టర్ దాసరి ఆంజనేయులు, ఏలూరు వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు చేశారు. మరికొంతమంది టీడీపీ నాయకులు ఏలూరు టూ టౌన్, త్రీటౌన్, రూరల్ పోలీస్ స్టేషన్లలో ఫిర్యాదులు చేశారు.

ఇదేం నిర్మాణం..!

» లక్ష్మణేశ్వరంలో భారీ మంచినీటి ప్రాజెక్టుకు రూ.2.06 కోట్లతో పనులు
» ప్రారంభం రోజునే లీకేజీలు, ట్యాంక్‌కు బీటలు


బీటలు తీసిన ట్యాంక్

నరసాపురం, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): ప్రజలకు స్వచ్ఛమైన నీటిని అందించాలన్న ప్రభుత్వ లక్ష్యాన్ని నాసిరకం పనులతో కాంట్రాక్టర్లు తూట్లు పొడుస్తున్నారు. పనులు ప్రారంభించిన రోజునే లీకేజీలు అవ్వుతుండడం, బీటలు తీయడాన్ని ఆరా తీస్తుంటే.. దాన్ని అధికారులు కప్పిపుచ్చే ప్రయత్నం చేయడం అందరిని నివ్వెరపర్చింది. ఈ ఘటన బుధవారం నరసాపురం మండలం లక్ష్మణేశ్వరం భారీ మంచినీటి ప్రాజెక్టులో రూ.2.06 కోట్లతో చేపట్టిన పనుల్లో చోటు చేసుకుంది. గత ప్రభుత్వ హయాంలో లక్ష్మణేశ్వరం మంచినీటి ప్రాజెక్టు నిర్లక్ష్యానికి గురైంది. కనీసం ఫిల్టర్‌బెడ్‌లు మరమ్మతులు చేయించలేదు. ఈ కారణంగా మురుగునీరే తొమ్మిది గ్రామాలకు సరఫరా అయ్యేది. ఇవి

» గత ప్రభుత్వ హయాంలో నిర్లక్ష్యం

తాగి ప్రజలు అనారోగ్య బారినపడే వారు. ఇవి తాగలేక నీటిని కొనుక్కుని తాగేవారు, మరికొందరు పట్టణంలోని మునిసిపల్ వాటర్‌ను తెప్పించుకునేవారు. ఈ పరిస్థితిని గమనించిన ప్రభుత్వం అధికారంలోకి రాగానే ప్రాజెక్టులో ఫిల్టర్‌బెడ్‌ల ఏర్పాటుకు రూ.2.06 కోట్లు కేటాయించింది. ఈ నిధులతో వేగంగా నీటిని శుద్ధి చేసే హైడ్రాలిక్ రా-వాటర్ ఫిల్టర్‌బెడ్‌ను నిర్మించారు. దీనికోసం ప్రత్యేక ట్యాంక్‌ను నిర్మించారు. ఆ పనుల్లో నాణ్యత లోపం ప్రారంభం రోజునే స్పష్టంగా బయటపడింది. నిర్మించిన భవనం పలుచోట్ల బీటలు తీసింది. కొన్నిచోట్ల నుంచి నీళ్ల లీకేజీ అవుతున్నాయి. ఇటు ట్యాంక్ ఫిల్లర్ వద్ద బీటలు దర్శనమిచ్చాయి. ఈవిధమైన లోపాలు బయటపడడంతో పనుల్లో డొల్లతనం బహిర్గతమయ్యాయి. దీనిపై ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ లోకేశ్‌ను వివరణ కోరగా.. ఇది కొత్తరకమైన నీటిశుద్ధి చేసే విధానం. నిర్మాణంలో కొన్నిచోట్ల బీటలు వచ్చాయి. వీటిని గుర్తించాం. కాంట్రాక్టరుతో సరి చేయిస్తామని వివరణ ఇచ్చారు.


ట్యాంకు నుంచి కారుతున్న నీళ్లు


హైడ్రాలిక్ రా-వాటర్ ఫిల్టర్‌బెడ్ ట్యాంక్

క్రైమ్ కార్నర్

విద్యార్థి ఆత్మహత్య

ఏలూరు క్రైం, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి):పేద కుటుంబంలో పుట్టి కష్టపడి ఆక్వాకల్చర్ యూనివర్సిటీలో ఎంఎస్సీ చదువుతున్న ఒక విద్యార్థి అనుమానాస్పద స్థితిలో తన ఇంటి వద్దే పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఏలూరు రూరల్ మండలం మానూరు కాలనీకి చెందిన తాడిశెట్టి లక్ష్మణస్వామికి ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. లక్ష్మణస్వామి అతని భార్య కూలీ పనులు చేస్తూ పిల్లలను చదివించుకుంటున్నారు. పెద్ద కుమారుడు తాడిశెట్టి వెంకటేశ్వరరావు(24) రాజమహేంద్రవరంలోని నన్నయ వర్సిటీలో ఎంఎస్సీ ఆక్వాకల్చర్ చదువుతున్నాడు. ఈనెల 8వ తేదీ మధ్యాహ్నం సెలవులు ఇచ్చారంటూ ఇంటికి వచ్చాడు. తమ్ముడుతో కలిసి మంగళవారం రాత్రి నిద్రించాడు. తెల్లవారుజామున పురుగుల మందుతాగి వాంతులు చేసుకుంటుండగా ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తీసుకువచ్చారు. కొద్దిసేపటికే మృతి చెందాడు. ఈ ఘటనపై వైద్యులు ఎమ్మెల్సీగా నమోదు చేసి ఆసుపత్రి ఔట్‌పోస్టు పోలీసులకు సమాచారం ఇచ్చారు. మృతదేహానికి పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రి మార్చురీకి తరలించారు. ఏలూరు రూరల్ ఎస్ఐ దుర్గాప్రసాద్ ఆధ్వర్యంలో హెచ్‌సీ మాతంగి జీవరత్నం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగించారు.

మనస్తాపంతో లారీ డ్రైవర్ ఆత్మహత్య

భీమవరం క్రైం, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి):తన భార్య పోలీసులకు అదనపు కట్నం కింద ఫిర్యాదు చేయడంతో మనస్తాపానికి గురైన ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. టూటౌన్ ఎస్ఐ ఇశ్రాయేల్ తెలిపిన వివరాలివి.. స్థానిక బలుసుమూడిలో నివాసముండే లారీ డ్రైవర్ కరిచర్ల నాగరాజు (29) సుమారు ఐదేళ్ల క్రితం పాలకొల్లు మండలం పూలపల్లికి చెందిన సుధారాణి అనే మహిళను ప్రేమ వివాహం చేసుకున్నాడు. వీరికి ఇద్దరు ఆడపిల్లలు ఉన్నారు. కొంతకాలం కాపురం అనంతరం భర్తతో విభేదాలు రావడంతో సుధారాణి పాలకొల్లు టౌన్ పోలీస్ స్టేషన్‌లో భర్త నాగరాజుపై ఫిర్యాదు చేసింది. మరి కొన్నాళ్ళకు పెద్దల సమక్షంలో రాజీ చేసుకున్నారు. రెండేళ్ళ క్రితం భీమవరం బలుసుమూడి వచ్చి కాపురం ఉంటున్నారు. మళ్లీ భార్యాభర్తల మధ్య విభేదాలు రావడంతో ఈనెల 8వ తేదీన ఆమె భర్తపై భీమవరం టూటౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఈమేరకు మనస్తాపంతో చెరువులో వాడే మాత్రలు మింగాడు. అపస్మారక స్థితిలోకి వెళ్లడంతో స్థానికులు పట్టణంలోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ బుధవారం ఉదయం 11 గంటలకు నాగరాజు మృతి చెందాడు. దీనిపై మృతుని తండ్రి శ్రీనివాసరావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

బంగారం చోరీ కేసులో నిందితుడి అరెస్ట్


వివరాలు వెల్లడిస్తున్న సీఐ దుర్గాప్రసాద్

నరసాపురం రూరల్, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి):మండలంలో సంచలనం రేకెత్తించిన వృద్ధ దంపతుల ఇంట్లో చోరీ కేసును పోలీసులు చేధించారు. దొంగతనానికి పాల్పడిన సి. వెంకటసాయిని అరెస్టు చేసి అతడి వద్ద నుంచి తొమ్మిది కాసుల, ఆరు గ్రాముల బంగారు ఆభరణాలు స్వాధీనం చేసుకున్నట్లు రూరల్ సీఐ దుర్గాప్రసాద్ విలేకర్లకు తెలిపారు. గత నెల 31వ తేదీ రాత్రి రిటైర్డ్ ఉద్యోగి సింహాచలం దంపతులు ఇంటో నిద్రిస్తుండగా ఇంటివెనుక నుంచి వచ్చి బీరువాలో భద్రపరిచిన ఆభరణాలు దోచుకుపోయారు. అతడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు క్లూస్ టీమ్‌ను రంగంలోకి దించారు. వేలిముద్రల ఆధారంగా పలువురిని విచారించిన పోలీసులు గ్రామానికి చెందిన వెంకటసాయిని అనుమానించారు. ఈ క్రమంలో మంగళవారం సాయంత్రం గ్రామంలోని ఆయుష్మాన్ ఆరోగ్య కేంద్రం వద్ద నిందితుడిని అదుపులోకి తీసుకుని విచారించగా నేరం ఒప్పుకున్నట్టు సీఐ చెప్పారు. రూరల్ ఎస్ఐ వెంకటసురేష్ పాల్గొన్నారు.

పోక్సో కేసులో ఒకరికి రెండేళ్ల జైలు

ఏలూరు క్రైం, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి):ఓ బాలిక స్నానం చేస్తుండగా బాత్రూమ్ కిటికీ వెంబడి చూసి ఆపై బెదిరించిన ఓ వ్యక్తిపై నేరం రుజువు కావడంతో రెండేళ్ల జైలు శిక్ష, రూ.మూడు వేల జరిమానా విధిస్తూ ఏలూరులో పోక్సో కోర్టు ప్రత్యేక న్యాయమూర్తి ఎస్. ఉమాసునంద బుధవారం తీర్పు చెప్పారు. ఏలూరులోని ఒక ప్రాంతానికి చెందిన 8వ తరగతి చదివే బాలిక 2020 సెప్టెంబరు 20వ తేదీ రాత్రి స్నానం చేస్తుండగా అటుగా వెళ్తున్న ఏలూరు తూర్పువీధి చీదరబోయిన వారి వీధికి చెందిన గాంచరి శివకుమార్ అలియాస్ శివ బాత్రూం కిటికీలోనుంచి చూశాడు. బాలిక అతడిని గమనించేసిరికి వేలు చూపిస్తూ బెదిరించాడు. మళ్లీ అదేనెల 23వ తేదీ రాత్రి ఆ బాలిక ఇంటి ముందు వెళ్తూ మద్యం బాటిల్‌తో బెదిరించాడు. భయపడిన ఆ బాలిక ఏలూరు మహిళా పోలీస్ స్టేషన్‌లో 2020 సెప్టెంబరు 24న ఫిర్యాదు చేయగా అప్పటి ఎస్ఐ వి. రామకోటేశ్వరరావు (ప్రస్తుతం ఏసీబీ విభాగం) కేసు నమోదు చేసి నిందితుడిని అరెస్టు చేశారు. ఈ కేసు ఏలూరు పోక్సో కోర్టులో విచారణ సాగింది. పీపీ వి.అమరశ్రీనివాస్ వాదించగా ఏలూరు మహిళా పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్ ఎం.సుబ్బారావు, మహిళాహెచ్‌సీ ఎంవీ రమణ, హెచ్‌సీ ఎం.శ్రీనివాస్ సహకరించారు. నిందితుడైన శివకుమార్‌పై నేరం రుజువు కావడంతో రెండేళ్ల జైలు శిక్ష, రూ.మూడు వేల జరిమానా విధించారు. జరిమానా చెల్లించని పక్షంలో మరో రెండు నెలలు జైలు శిక్ష విధించారు. బాలికకు రూ.50 వేల నష్టపరిహారం ఇవ్వాలని న్యాయమూర్తి తీర్పు చెప్పారు.

చికిత్స పొందుతూ మహిళ..

భీమడోలు, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి):రోడ్డు ప్రమాదంలో ఇరువురికి గాయాలు కాగా చికిత్స పొందుతూ ఒక మహిళ మృతి చెందింది. ఈనెల 4వ తేదీన ఎ.కొండూరు మండలం జీలగుంటకు చెందిన ధరావత్తు దుర్గమ్మ (62) అనే మహిళ ద్వారకాతిరుమల మండలం పంగిడిగూడెం గ్రామంలోని బంధువుల ఇంటికి పరామర్శకు వచ్చి రాత్రి తన వరసకు కొడుకైన రమావత్తు శివ బైక్‌పై పంగిడిగూడెం నుంచి పోతునూరు వెళ్తుండగా పోలసనాపల్లి హైవే పక్కనే ఉన్న ధాన్యం రాసులను ఢీకొట్టి కింద పడ్డారు. ఈ ప్రమాదంలో ఇరువురికి గాయాలయ్యాయి. వీరిని విజయవాడ ప్రభుత్వాసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ బుధవారం ఉదయం దుర్గమ్మ మృతి చెందింది. భీమడోలు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రెండు పూరిళ్లు దగ్ధం

» రూ. లక్షన్నర ఆస్తి నష్టం

ద్వారకాతిరుమల, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): వేంపాడులో షార్టు సర్క్యూట్‌తో బుధవారం రెండు పూరిళ్లు దగ్ధమ్యాయి. గ్రామానికి చెందిన పెండ్లి నాగేశ్వరరావు, అతని కుమారుడు రాంబాబు పక్కపక్కన ఇళ్లల్లో ఉంటున్నారు. ప్రతిరోజు మాదిరిగా వ్యవసాయ పనులకు వెళ్లిన వారు సాయంత్రం ఇంటికి వచ్చేసరికి పొగ, మంటలు వ్యాపిస్తున్నాయి. వెంటనే వారు భీమడోలు అగ్నిమాపక సిబ్బందికి సమాచారాన్ని అందించారు. ఇన్‌చార్జి ఫైర్‌స్టేషన్ ఆఫీసర్ ఇమ్మానియేలు ఆధ్వర్యంలో సిబ్బంది మంటలను అదుపు చేశారు. అప్పటికే ఇంటిలోని వస్తువులు, సామగ్రి కాలి బూడిదయ్యాయి. ఆస్తి నష్టం సుమారు రూ.లక్షన్నర వరకు ఉంటుందని అధికారి తెలిపారు.

తణుకు ప్రభుత్వాసుపత్రిలో కలకలం !

» పిల్లల వార్డులోకి మహిళ.. విచారణ అనంతరం పంపించిన వైనం

తణుకు, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి):తణుకు జిల్లా కేంద్ర ఆసుపత్రిలో ఓ సంఘటన కలకలం రేపింది. బుధవారం ఓ మహిళ ఆసుపత్రిలోని చిన్నపిల్లల వార్డులోకి వెళ్లి అక్కడ ఫోన్‌కు చార్జింగ్ పెట్టుకున్నారు. అదే సమయంలో చిన్న పిల్లల వివరాలు ఆరా తీసి, అక్కడ ఉన్న ఇద్దరు కవలల్లో ఒకరిని ఎత్తుకుంటానని అడగడంతో పిల్లల సంరక్షకులు అంగీకరించలేదు. ఆ మహిళపై వారికి అనుమానం వచ్చి వార్డులో సిబ్బంది, వైద్యులకు చెప్పడంతో సెక్యూరిటీ విభాగానికి చెందిన వ్యక్తి రావడం చూసి ఆమె కంగారు పడడంతో ఈ విషయంపై పోలీసులకు సమాచారం అందించారు. ఆ మహిళను పోలీసు స్టేషన్‌కు తీసుకెళ్లి విచారించారు. పిల్లల కోసం రాలేదని స్పష్టం కావడంతోపాటు వారి బంధువులు వచ్చి వాస్తవాలు చెప్పడంతో ఆమెను పంపించివేశారు.

అక్రమంగా మందులు అమ్ముతున్న వ్యక్తి అరెస్టు

» రూ.16 వేల విలువైన 11 రకాల మందులు స్వాధీనం

పాలకొల్లు అర్బన్, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): పాలకొల్లు పట్టణంలోని కటికల వీధికి చెందిన గుడాల చంద్రశేఖర్‌రావు అనే వ్యక్తి అక్రమంగా మందులు విక్రయిస్తున్నట్టు వచ్చిన సమాచారం మేరకు తణుకు డ్రగ్ ఇన్‌స్పెక్టర్ పి. మల్లికార్జునరావు బుధవారం దాడి చేసి అరెస్టు చేశారు. డ్రగ్ ఇన్‌స్పెక్టర్ మాట్లాడుతూ డ్రగ్ లైసెన్సు లేకుండా అబార్షన్ కిట్స్, లైంగిక సామర్థ్యం పెంచే సుమారు రూ.16 వేల విలువైన పదకొండు రకాల మందులను స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు. మందులను సీజ్ చేసి నిందితుడిని పాలకొల్లు కోర్టులో హాజరు పరిచి, కేసు నమోదు చేసినట్టు తెలిపారు. దాడిలో కానిస్టేబుల్ జి.బాబ్జీ, ఏరియా ఫార్మాసిస్టు, సిబ్బంది పాల్గొన్నారు.

రైతులు వ్యవసాయ శాఖ అధికారుల సూచనలు పాటించాలి

లింగపాలెం, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి) : మండలంలోని పలు గ్రామాల్లో వరి పంటను మండల వ్యవసాయాధికారి కోటగిరి మురళీకృష్ణ పరిశీలించారు. వరిపంటలో ఎక్కువగా మెడవిరుపు, కాండంకుళ్లు లాంటి తెగుళ్లు వచ్చే అవకాశం ఉందని దుక్కిదున్నే సమయం నుంచే సరైన పద్ధతుల్లో మందులు వాడితే తెగుళ్లను నివారించవచ్చన్నారు. రైతులు తమ పంటల్లో తెగుళ్ల నివారణకు వ్యవసాయ శాఖ అధికారుల సలహాలు పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయశాఖ సిబ్బంది, పలువురు రైతులు పాల్గొన్నారు.

నగరేశ్వర స్వామికి కల్యాణ పూజలు

ఏలూరు కార్పొరేషన్, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి) : అగ్రహారంలోని నగరేశ్వరస్వామి ఆలయం వద్ద ఈ నెల 11వ తేదీన స్వామివారి కల్యాణం నిర్వహిస్తున్నట్టు ఆలయ కమిటీ తెలిపింది. ఈ నేపథ్యంలో బుధవారం స్వామి, అమ్మవార్లను పెండ్లి కుమారుడు, పెండ్లి కుమార్తెలుగా అలంకరించి అర్చకులు చెరుకూరి వి.డి.మల్లికార్జునరావు పూజలు చేశారు. ఆలయ కార్యనిర్వహణాధికారి చిట్టిడి వెంకట నాగమునేశ్వరరావు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

గ్యాస్, పెట్రో ధరల పెంపుపై నిరసనలు

చింతలపూడి/పోలవరం/ఏలూరు కార్పొరేషన్, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి) : చింతలపూడి ఫైర్ స్టేషన్ సెంటర్, పోలవరం మండలం వింజరం సచివాలయం వద్ద,ఏలూరు పాతబస్టాండ్ సెంటర్‌లో సీపీఐ, సీపీఎం ఆధ్వర్యంలో గ్యాస్ ధరల పెంపును ఖండిస్తూ నిరసన తెలిపారు. గ్యాస్, పెట్రో ధరలు తగ్గించాలని, స్మార్ట్ మీటర్ల ఏర్పాటును విరమించుకోవాలని ఆయా సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. చింతలపూడి మండల కార్యదర్శి టి.బాబు, వింజరంలో సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు తెల్లం రామకృష్ణ, ఏలూరు పాతబ స్టాండ్ సెంటర్‌లో ఇఫ్టూ నాయకులు బుద్దా వెంకట్రావుల ఆధ్వర్యంలో ఈ ఆందోళనలు చేపట్టారు.

మార్క్ శంకర్ బాబు త్వరగా కోలుకోవాలని పూజలు

ఏలూరు రూరల్, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి) : సింగపూర్‌లో జరిగిన అగ్నిప్రమాదంలో గాయపడిన రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ కుమారుడు కొణిదల మార్క్ శంకర్ బాబు త్వరగా కోలుకోవాలని ఆర్టీసీ విజయవాడ జోనల్ చైర్మన్ రెడ్డి అప్పలనాయుడు ఆకాంక్షించారు. బుధవారం మార్కండేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. శంకర్ పేరుమీద ప్రత్యేకంగా అభిషేకాలు, అర్చనలు చేయించారు. ఈ కార్యక్రమంలో ఎన్.కాశీ నరేష్, ఎస్.రాజేశ్, వై.ధర్మేంద్ర, కె.మురళీకృష్ణ, జి.నవీన్, బుద్దా నాగేశ్వరరావు, వి.గాయత్రి, 12వ డివిజన్ జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నేరాలు జరగకుండా ప్రత్యేక నిఘా ఉంచండి

జీలుగుమిల్లి, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి) : శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా అప్రమత్తంగా ఉండాలని పోలవరం డీఎస్పీ బి.వెంకటేశ్వరావు సిబ్బందికి సూచించారు. జీలుగుమిల్లి సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కార్యాలయంలో పోలవరం నియోజకవర్గ సీఐలు, ఎస్సైలతో నేర సమీక్ష జరిగింది. ఈ క్రమంలో ఆయా పోలీస్ స్టేషన్ల పరిధిలో కేసుల పరిష్కారం, పురోగతి సాధించిన కేసులు వంటి అంశాలపై చర్చించారు. ఫ్రెండ్లీ పోలీసింగ్ విధానం పాటించాలని, చోరీలు జరగకుండా రాత్రి గస్తీ నిర్వహించాలని, క్రికెట్ బెట్టింగ్‌లపై నిఘా ఉంచి అరికట్టాలన్నారు. సీఐలు బి.వెంకటేశ్వరావు, పి.బాలసురేశ్ బాబు, సురేష్, ఎస్సైలు నవీన్ కుమార్, చంద్రశేఖర్, మహేశ్వరరావు, జయబాబు ఉన్నారు.

గోనె సంచులు సరఫరా చేయాలి : ఆర్డీవో

ఉంగుటూరు, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి) : దాళ్వా నూర్పిళ్ల నేపథ్యంలో ప్రతి రైతుకు నాణ్యత కలిగిన గోనె సంచులను సరఫరా చేయాల్సిన బాధ్యత వ్యవసాయ శాఖతో పాటు రెవెన్యూ సిబ్బందిపై ఉందని ఏలూరు రెవెన్యూ డివిజినల్ అధికారి అచ్యుత అంబరీష్ ఆదేశించారు. బుధవారం ఉంగుటూరు మండలంలోని కైకరం, ఉంగుటూరు రైతు భరోసా కేంద్రాన్ని ఆర్డీవో సందర్శించారు. ఈ సందర్భంగా రైతుల సమస్యలతో పాటు వాతావరణం దృష్ట్యా వారికి టార్పాలిన్లు పంపిణీ చేయాలన్నారు. ఆయన వెంట తహసీల్దార్ పాలపర్తి రవి కుమార్, డిప్యూటీ తహసీల్దార్ పూర్ణచంద్ర ప్రసాద్, మండల వ్యవసాయాధికారి ప్రవీణ్ అగ్రికల్చరర్, హార్టీకల్చర్ సిబ్బంది గ్లోరీ, లోవరాజు, ఐకేపీ సిబ్బంది పాల్గొన్నారు.

టీడీపీ నూతన సభ్యత్వ కార్డుల అందజేత

బుట్టాయగూడెం, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి) : పోలవరం నియోజకవర్గంలో 47 వేల సభత్వాలు నమోదవడం అభినందనీయమని టీడీపీ జిల్లా అధ్యక్షుడు గన్ని వీరాంజనేయులు అన్నారు. బుధవారం బుట్టాయగూడెం వచ్చిన ఆయన బూసరాజుపల్లి క్యాంపు కార్యాలయంలో నూతన సభ్యత్వ కార్డులను కార్యకర్తలు, నాయకులకు అందజేశారు. ముందుగా ఏపీ ట్రైకార్ చైర్మన్ బొరగం శ్రీనివాసులతో కలిసి క్యాంపు కార్యాలయంలో పార్టీ క్యాడర్‌తో నియోజకవర్గ స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ మేరకు కార్యకర్తలు, నాయకుల నుంచి వినతులు స్వీకరించారు. అనంతరం పార్టీ సభ్యత్వ కార్డులను పంపిణీ చేశారు. అలాగే జీలుగుమిల్లి మండలంలో పార్టీ వ్యతిరేక కార్యకలపాలకు పాల్పడుతున్న పద్దం వెంకటకృష్ణను పార్టీ నుంచి సస్పెండ్ చేశామని, టీడీపీతో అతనికి ఎటువంటి సంబంధంలేదని గన్ని స్పష్టం చేశారు.

వర్మి కంపోస్టు తయారీపై అవగాహన

బుట్టాయగూడెం, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): పంచాయతీలు చెత్త నుంచి సంపద సృష్టిపై దృష్టి సారించాలని డివిజనల్ పంచాయతీ అధికారి ఎండీ రహీంతుల్లా తెలిపారు. దొరమామిడిలో తడి, పొడి చెత్తల సేకరణ వర్మి తయారీ విధానంపై కార్యదర్శులకు, హరిత రాయబారులకు అవగాహన కల్పించారు. తడిపొడి చెత్త నుంచి సేంద్రియ ఎరువు తయారు చేసే విధానాన్ని వివరించారు. కార్యక్రమంలో ఎంపీడీవో కె.జ్యోతి, డీఎల్పీవో టి.నిఖిల్, సర్పంచ్ తెల్లం రాముడు, ఉప సర్పంచ్ ఎం.శ్రీనివాసరావు, కార్యదర్శి జె.కిరణ్ కుమార్, కొయ్యలగూడెం, బుట్టాయగూడెం మండలాల కార్యదర్శులు, హరిత రాయబారులు, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించండి

లింగపాలెం, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని ధర్మాజీగూడెంలోని బత్రాజులపేట పాఠశాల హెచ్ఎం కె.గాస్పర్ తల్లిదండ్రులకు సూచించారు. బుధవారం పాఠశాల ఉపాధ్యాయులు గ్రామంలో విద్యార్థుల తల్లిదండ్రులను కలిసి విద్యార్థులకు ప్రభుత్వ పాఠశాలల్లో వారికి అందిస్తున్న ఉచిత సౌకర్యాల గురించి వివరించారు. ప్రభుత్వ పాఠశా లల్లో ఉచిత విద్య అందిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో చంద్ర జ్యోతి, కుమార్ మంగళం, ఎం.వెంకటసత్యనారాయణ పాల్గొన్నారు.

ఆరోగ్యకరమైన వాతావరణంలో పిల్లల్ని పెంచాలి

ఏలూరు, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి) : గర్భిణీలు, బాలింతలు సకాలంలో పౌష్టికాహారం తీసుకోవడంతో పాటు చిన్నారులకు రెండేళ్ల వయస్సు వచ్చే వరకు ఆరోగ్యకరమైన వాతావరణంలో సాకేలా ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని ఐసీడీఎస్ ఏలూరు సీడీపీవో కె.విజయలక్ష్మి సూచించారు. పోషణ పక్వాడా కార్యక్రమంలో భాగంగా శివగోపాలపురం పరిధిలో అంగన్‌వాడీ కేంద్రం పరిధిలో బాలింతలు, గర్భిణీలు, ఆయాలు, టీచర్లతో బుధవారం ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో సూపర్‌వైజర్ బి మంగ, ఏఎన్ఎం శ్యామల పాల్గొన్నారు.

● ప్రజా సొమ్ము దుర్వినియోగం..

లింగపాలెం,(ఆంధ్రజ్యోతి) : గ్రామాల్లో సేకరించిన చెత్తను డంపింగ్ యార్డులకు తరలించాలంటే వాహనాలు చాలా అవసరం. అయితే చెత్త వాహనాలు తుప్పు పట్టి మూలనపడటంతో పారిశుధ్య పనులకు ఆటంకం ఏర్పడుతోంది. లక్షలాది రూపాయల ప్రజాధనం వెచ్చించి కొనుగోలు చేసిన వాహనాల పట్ల అధికారులు నిర్లక్ష్యం వహించడంతో ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. లింగపాలెం మండలంలో కొన్ని గ్రామాల్లో బ్యాటరీల సాయంతో నడిచే గ్రీన్ వెహికల్స్, సైకిల్ రిక్షాలు ఎండకు ఎండి, వానకు తడిచి తుప్పుపట్టి ఎందుకూ పనికిరాకుండా నిరుపయోగంగా మారాయి. పాడైన వాహనాలకు మరమ్మతులు చేయించేందుకు కూడా గ్రామ పంచాయతీల్లో నిధులు కరువయ్యాయా? అంటూ ప్రజలు ప్రశ్నిస్తున్నారు.



తుప్పు పట్టిపోతున్న చెత్త తరలింపు వాహనాలు

శాంతిభద్రతలకు విఘాతం కలిగించాలని చూస్తే సహించం



విలేకరులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే చంటి

ఏలూరుటూటౌన్, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి) : ప్రశాంతంగా ఉన్న జిల్లాలో అలజడులు సృష్టించేందుకు వైసీపీ నేతలు కుట్రలు పన్నితే సహించేదిలేదని ఎమ్మెల్యే బడేటి చంటి ధ్వజమెత్తారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కార్యకర్తలతో ఎమ్మెల్యే చంటి సమావేశమయ్యి మాజీ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు చేసిన వ్యాఖ్యలపై అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మాజీ సీఎం జగన్మోహన్ రెడ్డి పోలీసులపై చేసిన అభ్యంతరకర వ్యాఖ్యలను ఖండించారు. అధినేత మెప్పుకోసం నోటికొచ్చినట్లు మాట్లాడితే సహించేదిలేదన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు శాంతి భద్రతలకు అధిక ప్రాధాన్యం ఇస్తారని, లేకపోతే వైసీపీ నేతలు రాష్ట్రంలో తిరిగే పరిస్థితి ఉండేదికాదన్నారు. 14వ తేదీన 3వ డివిజన్‌లో నిర్వహించే అంబేద్కర్ జయంతి వేడుకలను పురస్కరించుకుని ఏర్పాటు చేసిన కరపత్రాలను ఎమ్మెల్యే బడేటి చంటి ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ పార్థసారథి, చోడే వెంకటరత్నం, నగర అధ్యక్షులు పి.శివప్రసాద్, టీడీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షులు జాలా బాలాజీ పాల్గొన్నారు.

పట్టణాల అభివృద్ధికి కృషి : రోషన్

జంగారెడ్డిగూడెం : పట్టణాల అభివృద్ధికి ప్రభుత్వం కోట్ల రూపాయల నిధులు ఖర్చు చేస్తోందని చింతలపూడి ఎమ్మెల్యే సొంగా రోషన్ కుమార్ అన్నారు. బుధవారం ఎమ్మెల్యే పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా జంగారెడ్డిగూడెం మున్సిపల్ సాధారణ నిధులు రూ.2.11 కోట్లతో నిర్మించిన వివిధ రోడ్లు, సీసీ డ్రైన్లు, పైప్‌లైన్లు, బోర్ వెల్స్‌ను ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్‌పర్సన్ బత్తిన లక్ష్మి, నాయకులు పాల్గొన్నారు.

ఇక ఇంటర్ విద్యకు జిల్లా అధికారి ఒక్కరే!

- డీవీఈవోలనే డీఐఈవోలుగా పేరు మార్పు
- త్వరలో పదోన్నతిపై జిల్లాకు రెగ్యులర్ డీవీఈవో నియామకం

ఏలూరు అర్బన్, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి) : ఇంటర్ విద్యలో ప్రభుత్వం చేపట్టిన సంస్కరణల్లో భాగంగా రాగల రెండు, మూడు రోజుల్లో రెగ్యులర్ ప్రాతిపదికన జిల్లా వృత్తి విద్యాశాఖాధికారు(డీవీఈవో)ల నియామకాలు జరగనున్నాయి. ఈ మేరకు రాష్ట్ర వ్యాప్తంగా పదోన్నతులకు అర్హతలున్న 19 మంది ప్రభుత్వ జూనియర్ కళాశాలల ప్రిన్సిపాల్స్‌తో కూడిన సీనియార్టీ జాబితా సిద్ధమైంది. ఇప్పటి వరకు ఇన్‌చార్జి డీవీఈవో, ఆర్ఐవో(ఎఫ్ఏసీ)ల పాలనలో ఇంటర్ విద్య కార్యకలాపాలు జరుగుతున్నాయి. ఇంటర్ కళాశాలలపై అజమాయిషీ, పాలనావ్యవహారాలు డీవీఈవో, పరీక్షల నిర్వహణ, పాఠ్యపుస్తకాల పంపిణీ ప్రాంతీయ పర్యవేక్షణాధికారి(ఆర్ఐవో)ల నేతృత్వంలో జరుగుతుండగా, నూతన సంస్కరణల మేరకు వచ్చే విద్యా సంవత్సరం నుంచి ఈ రెండు బాధ్యతలను కలిపి ఒకరికే అప్పగించనున్నారు. ఈ మేరకు ఆర్ఐవో పోస్టులను ఎత్తివేసి, త్వరలో నియమించనున్న రెగ్యులర్ డీవీఈవో పోస్టులకు ఇకమీదట జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖాధికారి(డీఐఈవో)గా నామకరణం చేయనున్నారు. ముందుగా సీనియార్టీ జాబితా ప్రకారం డీవీఈవో పోస్టులను భర్తీ చేసిన అనంతరం, కొత్తగా ఏర్పడిన 13 జిల్లాలకు కూడా డీవీఈవో పోస్టుల మంజూరు, నియామకాలతర్వాతే డీఐఈవోలుగా పేరుమార్పు జరుగుతుందని చెబుతున్నారు. దీంతో జిల్లాల్లో ఇంటర్ విద్యకు ఇప్పటి వరకు ఉన్న డీవీఈవో, ఆర్ఐవో పోస్టులస్థానే ఇకమీదట ఒక్కరే(డీఐఈవో) ఉంటారు. కాగా ఏలూరు జిల్లాకు సంబంధించి కొద్దిరోజుల్లో జరగనున్న రెగ్యులర్ డీవీఈవో పోస్టుకోసం ప్రస్తుతం అందుబాటులో ఉన్న సీనియార్టీ జాబితాలో ఉమ్మడి కృష్ణా జిల్లాకు చెందిన ఇద్దరు ప్రిన్సిపాల్స్ ప్రయత్నిస్తున్నట్టు సమాచారం. పదోన్నతులపై భర్తీ అయ్యే డీవీఈవో పోస్టులను సీనియార్టీ జాబితాలో ప్రాధాన్యతాక్రమంలో నిబంధనలు అనుసరించి భర్తీ చేస్తారు. అయితే అధికారికంగా స్పష్టత రావాల్సి ఉంది.

ధాన్యం కొనుగోలు కేంద్రాల ప్రారంభం

దెందులూరు, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి) : అభివృద్ధి, సంక్షేమమే, రాష్ట్ర ప్రభుత్వ విధానమని దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ అన్నారు. బుధవారం పోతునూరు శివారు ఉండ్రాజవరంలో జేసీ ధాత్రిరెడ్డి, ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్‌లు పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేశారు. ఈ మేరకు తమ గ్రామంలోకి వచ్చిన చింతమనేనికి పార్టీ నాయకులు కార్యకర్తలు గజమాలతో స్వాగతం పలికారు. అదేవిధంగా ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. సబ్సిడీ యంత్రాల అందజేతలో భాగంగా 14 మంది లబ్ధిదారులకు మినీ ట్రాక్టర్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండలాధ్యక్షుడు మాగంటి నారాయణ ప్రసాద్, టీడీపీ క్లస్టర్ ఇంచార్జీ బోడేటి మోహన్‌బాబు, పార్టీ కార్యదర్శి నున్న లక్ష్మణ్, నీటి సంఘం అధ్యక్షులు రాంబాబు పాల్గొ



ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభిస్తున్న జేసీ

నగా స్వరాజ్ భవన్‌లో చింతమనేని మాట్లాడారు. అనంతరం కొవ్వలిలోని సహకార సంఘం బ్యాంకు కార్యాలయ అవరణలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో గోదావరి కాల్వ డీసీ చైర్మన్ వెలమాటి రాంబాబు, వి.అనిల్,తహసీల్దార్ సుమతి పాల్గొన్నారు.

తూకంలో మోసగిస్తే..

(ఐదో పేజీ తరువాయి)

తూకం తీస్తాం. తక్కువ ఉంటే చర్యలు తీసుకుంటాం. ఐదు కిలోమీటర్ల లోపు దూరం ఉన్న ఇళ్ల యజమానుల దగ్గర అదనంగా డబ్బులు వసూలు చేయకూడదు.

- కైకలూరు సెంటర్‌లో స్వీట్‌షాపుల్లో తూకంలో తేడా, స్వీట్లు నాసిరకంగా ఉంటున్నాయి. స్వీట్స్‌లో ఫుడ్ కలర్లు వాడడం వల్ల ప్రజలు అనారోగ్యం పాలవుతున్నారు. సంత మార్కెట్, గాంధీబొమ్మ సెంటర్‌లో కిరాణా షాపుల్లో ఎంఆర్‌పీల కన్నా ఎక్కువ ధరలు వసూలు చేస్తున్నారు.

- సీహెచ్ లలిత, కైకలూరు

ఏసీ : సంబంధిత షాపులపై ఫుడ్ ఇన్‌స్పెక్టర్లతో కలిసి దాడులు నిర్వహిస్తాం. తూకంలో తేడా, నాసిరకంగా ఉంటే చర్యలు తప్పవు. స్వీట్లలో కలర్లు వాడితే సహించేది లేదు. ఎంఆర్‌పీ కంటే ఎక్కువకు అమ్మినవారిపై జరిమానాలు విధిస్తాం.

- గణపవరం పరిసర ప్రాంతాల్లో రేషన్ షాపుల్లో డీలర్లు తక్కువ తూకంతో నిత్యావసర సరుకులు పంపిణీ చేస్తున్నారు. రేషన్‌షాపులపై తనిఖీలు జరగడం లేదు.

- సుబ్రహ్మణ్యం, గణపవరం

ఏసీ: రేషన్ షాపుల్లో తనిఖీలు చేస్తాం. మోసాలకు పాల్పడే వారిపై చర్యలు తీసుకుంటాం.

- ముదినేపల్లిలో రైతుల నుంచి ప్రైవేట్ వ్యాపారులు ధాన్యం కొనుగోళ్లు చేస్తున్నారు. వీరు తూకాలు సరిగ్గా వేయడం లేదు. రైతులను మోసం చేస్తున్నారు. 75 కేజీల బస్తాకు రెండు కిలోలు తేడా చూపిస్తున్నారు.

- సుధాకర్, ముదినేపల్లి మెయిన్ రోడ్డు

ఏసీ: ముదినేపల్లి లీగల్ మెట్రాలజీ సిబ్బందితో తనిఖీలు చేయించి, మోసం చేసే వ్యాపారులపై చర్యలు తీసుకుని, రైతులకు న్యాయం చేస్తాం.

మాంసం దుకాణాల్లో దగా

- కలిదిండి మెయిన్‌రోడ్డు మార్కెట్‌లో చికెన్, మటన్, చేపలు దుకాణాల్లో తూకంలో దగా చేస్తున్నారు. షాపు నుంచి ఇంటికెళ్లి తూకం వేస్తే కేజీకి 100 గ్రాముల పైనే తేడా ఉంటోంది. మోసాలను అరికట్టాలి.

- వెంకటేశ్వరరావు, కలిదిండి

ఏసీ : కలిదిండి ఏరియా ఇన్‌స్పెక్టర్లతో తనిఖీలు చేయిస్తాం. తూకంలో మోసాలు చేసే వ్యాపారులను గుర్తించి చట్టప్రకారం జరిమానా విధిస్తాం. మళ్లీ పునరావృతం అయితే లీగల్ మెట్రాలజీ చట్టాల మేరకు లైసెన్సు రద్దు చేస్తాం.

- జంగారెడ్డిగూడెం చేపల మార్కెట్‌లో తూకాల్లో తేడాలు జరుగుతున్నాయి. చేతి కాటాలతో మోసాలు జరుగుతున్నాయి. డిజిటల్ వేయింగ్ మెషిన్లు ఉపయోగించడం లేదు. మూడు కేజీలు కొంటే 2.50 కిలోల మించి బరువు చూస్తే రావడం లేదు. దీనిపై తనిఖీలు చేయండి.

ఏసీ: జంగారెడ్డిగూడెం చేపల మార్కెట్‌లో తనిఖీలు నిర్వహిస్తాం. తక్కువ తూచే వారిపై చర్యలు తీసుకొంటాం. డిజిటల్ వేయింగ్ మెషీన్లు వాడేలా చర్యలు తీసుకుంటాం.

నాసిరకం ఆహారం

- ఏలూరు ఆసుపత్రుల చుట్టుపక్కల హోటళ్లలో నాసిరకం భోజనాలు వండిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. తనిఖీలు చేయడం లేదు. రుచి,పచి లేకపోవడం, కారంగా ఉండటంతో చిన్నపిల్లలు, మహిళలు, వృద్ధులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దీనిపై చర్యలు తీసుకోవాలి.

- పి.సాంబశివరావు, ఏలూరు

ఏసీ : ఫుడ్ ఇన్స్‌పెక్టర్లు, లీగల్ మెట్రాలజీ ఇన్‌స్పెక్టర్ల సంయుక్త ఆధ్వర్యంలో తనిఖీలు చేస్తాం. నాసిరకం, నిల్వ ఉన్న భోజన పదార్థాలను గుర్తించి హోటళ్ల యజమానులు చర్యలు తీసుకొంటాం.

పెట్రోల్ రీడింగ్‌ల్లో తేడా

- జంగారెడ్డిగూడెం మున్సిపాల్టీ పరిధిలో పెట్రోల్ బంకుల్లో మీటరు రీడింగ్‌ల్లో తేడాలుంటు న్నాయి. దీంతో మైలేజీ రావడం లేదు. కల్తీ జరుగుతుందని మాకు అనుమానం.

- లక్ష్మణ్, ఆర్.వెంకటేశ్వరరావు, జంగారెడ్డిగూడెం

ఏసీ: పెట్రోల్ బంకుల్లో లీగల్ మెట్రాలజీ ముద్రలు వేసిన ఐదు లీటర్ల డబ్బాలు ఉంటాయి. కొలతల్లో తేడాలు వస్తే ఆ డబ్బాలో కొలత వేసుకుని తెలుసుకోవచ్చు. ఇక్కడ తనిఖీలు నిర్వహిస్తాం.

ప్రత్తికోళ్లలంకలో అంతుపట్టని జ్వరాలు

(ఐదో పేజీ తరువాయి)

చేయాలని వైద్య ఆరోగ్యశాఖ సిబ్బందిని ఆదేశించా రు. గుడివాకలంక పీహెచ్‌సీ వైద్యుడు డాక్టర్ ఆనంద్ నేతృత్వంలో బుధవారం ప్రత్తికోళ్ళలంకలో ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహించారు. సుమారు 150 మందికి రక్త పరీ క్షలు నిర్వహించగా ఐదుగురికి జ్వర తీవ్రత ఉన్నట్టు గుర్తించారు.మందులు అందజేశారు. గ్రామంలో ప్రత్యేక పారిశుధ్య పనులు చేపట్టారు. ఎంపీడీవో వెన్నా శ్రీలత, టీడీపీ మండల అధ్యక్షుడు నంబూరి నాగరాజు, కొల్లేరు సీనియర్ నాయకుడు సైదు సత్యనారాయణ తది తరులు పర్యవేక్షించారు.

సీఎం పర్యటన ఏర్పాట్ల పరిశీలన

(ఐదో పేజీ తరువాయి)

కార్యాలయంలో ప్రభుత్వ శాఖల అధికారులతో సమీక్ష జరి పారు.అన్ని శాఖల అధికారులు పూర్తి సమాచారంతో సిద్ధంగా ఉండాలని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమాల్లో కలెక్టర్ వెట్రి సెల్వి, ఎస్పీ కేపీఎస్ కిశోర్, జేసీ పి.ధాత్రిరెడ్డి, సబ్ కలెక్టర్ స్మరణ్‌రాజ్, ఇంటెలిజెన్స్ ఏఎస్పీ కృష్ణారావు ఇతర ప్రభుత్వ అధికారులు, తెలుగుదేశం నాయకులు పాల్గొన్నారు.

టీడీపీ నాయకుడి మృతికి సంతాపం

కుక్కునూరు, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి) : రాజీవ్ నగర్ గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు గోలమూడి వెంకటేశ్వరావు ఇటీవల మృతి చెందారు. బుధవారం ట్రైకార్ చైర్మన్ బొరగం శ్రీనివాస్ ఆ కుటుంబ సభ్యులను పరామర్శించారు. టీడీపీకి చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో మండలాధ్యక్షుడు ములిశెట్టి నాగేశ్వరరావు, ఉప సర్పంచ్ పిచ్చుకరాజు, చుంచు సత్యనారాయణ, రమణ రాజు, నారేంద్రరాజు పాల్గొన్నారు.

విద్యుత్ సిబ్బందిపై చర్యలు తీసుకోండి

కుక్కునూరు, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): ప్రజలతో దురుసుగా వ్యవహరిస్తూ అవినీతికి పాల్పడుతున్న విద్యుత్ అధికారులపై ఎందుకు చర్యలు తీసుకోవడంలేదని సీపీఎం జిల్లా కార్యదర్శి ఏ.రవి ఉన్నతాధికారులను ప్రశ్నించారు. బుధవారం చీరవల్లిలో జరిగిన మండల ముఖ్య కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతూ కుక్కునూరు విద్యుత్ శాఖ కార్యాలయంలో కంప్యూటర్ ఆపరేటర్ సుబ్బారావు, ఏఈ పాపారావుల తీరుపై తహసీల్దార్‌కు ఫిర్యాదు చేసినా చర్యలు తీసుకోలేదన్నారు. ఈ సమావేశంలో జిల్లా కమిటీ సభ్యులు వై.నాగేంద్రరావు, మండల కార్యదర్శి బుయ్యన శ్రీను, మేడిపల్లి బాబు పాల్గొన్నారు.

పదోన్నతుల్లో వ్యత్యాసాలు సరికాదు

ఏలూరు అర్బన్, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి) : స్కూల్ అసిస్టెంట్ కేడర్ తెలుగు సబ్జెక్టు పదోన్నతులు కల్పించడంలో అర్హతలున్న ఎస్జీటీలకు కూడా అవకాశం కల్పించాలని డిమాండ్ చేస్తూ నోబుల్ టీచర్స్ అసోసియేషన్(ఎన్టీయే) జిల్లా నాయకులు పాండురంగా రావు, రమేష్, సత్యనారాయణరాజులు బుధవారం ఏలూరులో డీఈవో వెంకటలక్ష్మమ్మకు వినతిపత్రం అందజేశారు. ప్రభుత్వం నుంచి ఎలాంటి జీవోలు లేనప్పటికీ కేవలం మౌఖిక ఆదేశాలతో లాంగ్వేజి పండిట్లతో జిల్లా అధికారులు సీనియార్టీ జాబితాలు రూపొందించడం పట్ల అభ్యంతరం తెలిపారు. సీనియార్టీ జాబితాప్రకారమే పదోన్నతులివ్వాలని కోరారు.

8 నుంచి పౌష్టికాహార పక్షోత్సవాలు

భీమడోలు, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి) : పౌష్టికార పక్షోత్సవాల్లో భాగంగా ఈ నెల 8 నుంచి 22వ తేదీ వరకు మండలంలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు అధికారులు తెలిపారు. గురువారం అంబర్‌పేట, కురేళ్లగూడెం, పూళ్ల, కోడూరుపాడు, అన్నేవారిగూడెం, దుద్దేపూడి గ్రామాల్లో జరిగే కార్యక్రమాల్లో చిరుధాన్యాల వాడకం, పౌష్టికాహార వినియోగంపై అవగాహన కల్పిస్తారు. అలాగే బాల్య వివాహాల కారణంగా తలెత్తే సమస్యల గురించి అవగాహన కల్పించనున్నారు.

పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం

టి.నర్సాపురం, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం చేకూరుతుందని ఐసీడీఎస్ చింతలపూడి ప్రాజెక్టు అధికారిణి మాధవి తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో జీ.మణికుమారి అధ్యక్షతన పౌష్టికాహార పక్షోత్సవంపై అవగాహన కల్పించారు. ముఖ్య అతిథిగా హాజరైన ప్రాజెక్టు అధికారిణి మాధవి మాట్లాడుతూ పౌష్టికాహార పక్షోత్సవం ప్రారంభమైందని, 22వ తేదీ వరకు అంగన్వాడీ కేంద్రంలో నిర్వహించాలని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖాధికారిణి కల్యాణి, పంచాయతీ విస్తర్ణాధికారి శ్రీనివాస్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు ఎం.లక్ష్మి, ఉషారాణి, అంగన్వాడీ కార్యకర్తలు, మహిళా పోలీసులు పాల్గొన్నారు.

ఇల్లు కూలిపోయిన బాధితుడిని ఆదుకోండి

బుట్టాయగూడెం, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి) :గాలీ వానకు ఇల్లు కూలిపోయి కట్టుబట్టలతో 24 గంటలుగా ఆరుబయటే ఉంటున్న తమను అధికారులు పట్టించుకోలేదని బాధితుడు వాపోతున్నాడు. ఈదురు గాలులకు తాటుకిల్లు కూలిపోవడంతో లోపల నిద్రిస్తున్న రాజుకు స్వల్పగాయాలవడంతో స్థానిక పీహెచ్‌సీలో వైద్యం చేయించుకున్నట్టు తెలిపారు. ఇల్లు కూలిపోయిన నిరాశ్రయులైన బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలని మాజీ సర్పంచ్ కోర్స వెంకటేశ్వరరావు, ఆదివాసీ సంఘం నాయకుడు చోడెం రాజు, బూత్ ఇన్‌చార్జీ కొవ్వాసి గంగాధర్‌లు డిమాండ్ చేశారు. రెవెన్యూ, పంచాయతీ కార్యదర్శి, సచివాలయం సిబ్బందికి ఫోన్ చేసి సమాచారం తెలిపినా స్పందన లేదన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం

జంగారెడ్డిగూడెం, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి) : స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద ఎమ్మెల్యే సొంగా రోషన్ కుమార్ ఆధ్వర్యంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని చింతలపూడి ఎమ్మెల్యే సొంగా రోషన్ కుమార్ అధ్యక్షతన బుధవారం నిర్వహించారు. జంగారెడ్డిగూడెం మండలం, పట్టణం నుంచి అనేక మంది ప్రజలు తమ వినతులను ఎమ్మెల్యేకు అందజేశారు.అధిక శాతం ప్రజలు పారిశుధ్యం నిర్వహణ, వీధి దీపాల సమస్యలను వివరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్ పర్సన్ బత్తిన లక్ష్మి, వివిధ శాఖల అధికారులు, జనసేన నియోజక వర్గ ఇన్‌చార్జి మేకా ఈశ్వరయ్య టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

దూరవిద్య ఇంటర్ ప్రాక్టికల్స్ ప్రశాంతం

ఏలూరు అర్బన్, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి) : ఏపీ సార్వత్రిక విద్యాపీఠం దూరవిద్య ఇంటర్మీడియట్ ప్రాక్టికల్స్ పరీక్షల్లో భాగంగా బుధవారం జరిగిన పరీక్షలకు ఫిజిక్సు 41మంది విద్యార్థులకు 32మంది, కెమిస్ట్రీ 43మందికి 29 మంది హాజరయ్యారని డీఈవో వెంకటలక్ష్మమ్మ తెలిపారు.



పద్మశ్రీని పరామర్శిస్తున్న మాగంటి బాబు, తదితరులు

పద్మశ్రీ కుటుంబానికి పరామర్శ

పెదపాడు, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి) : జడ్పీ ఛైర్ పర్సన్ ఘంటా పద్మశ్రీని గోపాలపురం ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు, ఎమ్మెల్సీ వంకా రవీంద్ర, మాజీ మంత్రి మాగంటి వెంకటేశ్వరరావు(బాబు)లు బుధవారం పరామర్శించారు. పద్మశ్రీ అత్తగారు అచ్చాయమ్మ ఇటీవల మృతి చెందడంతో సత్యవోలులోని ఆమె స్వగృహానికి వెళ్లి పరామర్శించారు. అలాగే బీసీ నాయకులు ఘంటా ప్రసాదరావు, ఘంటా ఫణీంద్రలను కలిసి సానుభూతి తెలిపారు.

13న గురుకుల ప్రవేశ పరీక్ష

పెదవేగి/ద్వారకాతిరుమల, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి) : సంక్షేమ గురుకుల విద్యాలయాల్లో ప్రవేశాలకు ఈ నెల 13న ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నట్టు పెదవేగి గురుకుల పాఠశాల, కళాశాల ప్రిన్సిపాల్ మాడా వెంకటేశ్వరరావు తెలిపారు. 5వ తరగతిలో ప్రవేశానికి ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరానికి మధ్యాహ్నం 2నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు ప్రవేశ పరీక్ష ఉంటుందన్నారు. అభ్యర్థులు హాల్ టికెట్లను వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు. ద్వారకాతిరుమల గురుకు బాలికల పాఠశాల ప్రిన్సిపాల్ బెజవాడ రాణి మాట్లాడుతూ పరీక్షా కేంద్రానికి విద్యార్థులు గంట ముందు చేరుకోవాలని కోరారు.

సర్ సీఆర్ఆర్‌లో వర్క్‌షాపు

పెదపాడు, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి) : రీసెర్చి పేపరు ప్రజంటేషన్ మీద వట్లూరు సర్‌సీఆర్‌రెడ్డి మహిళా కళాశాలలో ఒక రోజు వర్క్‌షాపును బుధవారం నిర్వహించారు.వర్క్‌షాపులో ఆచార్య నాగార్జున యూనివర్సిటీ ప్రొఫెసర్ సంధ్య రీసెర్చి పేపరు అంటే ఏమిటి, పేపరు ప్రజంటేషన్, పబ్లిష్ ఎలా చేయాలనే అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సరళ, ఐక్యూఏసీ కో-ఆర్డినేటర్ ఝాన్సీలక్ష్మి పాల్గొన్నారు.

నీటి తొట్టెలు ఏర్పాటు చేయండి

ఉంగుటూరు, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): వేసవి దృష్ట్యా గ్రామాల్లోని పశువుల దాహార్తి తీర్చేందుకు నీటి తొట్టెలు ఏర్పాటు చేయాలని ఉంగుటూరు ఎంపీడీవో జి.రాజ్ మనోజ్ కోరారు. బుధవారం ఉంగుటూరు ఎంపీడీవో కార్యాలయంలో జరిగిన కార్యదర్శులకు దిశా నిర్దేశం చేశారు. ఉపాధి నిధులు ఉపయోగించుకుని నీటి తొట్టెలు ఏర్పాటు చేయాలన్నారు. సమావేశంలో ఈవోపీఆర్డీ చంద్రశేఖర్ పాల్గొన్నారు.

రైతులకు బరకాలివ్వండి

ఉంగుటూరు, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి) : అకాల వర్షంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారని, బరకాలను అందించి ధాన్యం ఆరబెట్టుకునేందుకు కల్లాలు ఏర్పాటు చేయాలని ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ డిమాండ్ చేశారు. బుధవారం కైకరంలో ఆరబెట్టిన ధాన్యాన్ని పరిశీలించి రైతులకు సకాలంలో గోనె సంచులు అందించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు గుత్తికొండ వెంకట కృష్ణారావు, కోనా శ్రీనివాసరావు, జి.శ్రీరామ్మూర్తి, జి.సూర్యారావు, శానం వీర రాఘవులు పాల్గొన్నారు.

విస్తరాకుల తయారీ పరిశీలన

బుట్టాయగూడెం, 9(ఆంధ్రజ్యోతి): మంగయ్యపాలెంలో నిర్వహిస్తున్న విస్తరాకుల తయారీ కేంద్రాన్ని బుధవారం కె.ఆర్.పురం ఐటీడీఏ పీవో కె.రాములు నాయక్ పరిశీలించారు. విస్తరాకుల తయారీలో తీసుకోవలసిన జాగ్రత్తలపై సభ్యులకు సూచనలు చేశారు. కార్యక్రమంలో వెలుగు సీసీ వరలక్ష్మి, సంఘ సభ్యులు పాల్గొన్నారు.

పాఠశాలల విలీనంపై యూటీఎఫ్ అభ్యంతరం

ఏలూరు అర్బన్, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి) : ఐదు బడుల విధానంలో భాగంగా కొత్తగా ఏర్పాటు చేస్తున్న మోడల్ ప్రైమరీ స్కూళ్లలోకి సమీప గ్రామాల్లోని ప్రాథమిక పాఠశాలలను విలీనం చేయడంలో విద్యార్థుల తల్లిదండ్రుల అభ్యంతరాలను ఏలూరు ఎమ్మెల్యే బడేటి చంటికి యూటీఎఫ్ జిల్లా నాయకులు బుధవారం తెలియజేశారు. తల్లిదండ్రులు కోరితే 45 మంది విద్యార్థులున్నా మోడల్ ప్రైమరీ స్కూల్స్ ఏర్పాటుచేస్తామని అధికారులు భరోసా ఇచ్చి ఇప్పుడు ప్రాథమిక పాఠశాలలను విలీనం చేయడం సరికాదన్నారు. యూటీఎఫ్ నాయకులు లేవనెత్తిన అభ్యంతరాలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. సంఘ నాయకులు రంగమోహన్, రాజారావు, కిరణ్ కుమార్, లక్ష్మణ్ పాల్గొన్నారు.

చంద్ర రాజేశ్వరరావు వర్ధంతి

ఏలూరు కార్పొరేషన్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి) : కమ్యూనిస్టు పార్టీ సీనియర్ నాయకులు చంద్ర రాజేశ్వరరావు ఆశయాలను, పోరాటాలను నేటి కమ్యూనిస్టులు ఆదర్శంగా తీసుకోవాలని సీపీఐ ఏలూరు జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణచైతన్య పిలుపునిచ్చారు. ఏలూరు సీపీఐ కార్యాలయంలో బుధవారం చంద్ర రాజేశ్వరరావు 31వ వర్ధంతిని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు పాల్గొని రాజేశ్వరరావు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

● చింతలపూడి : స్థానిక సీపీఐ కార్యాలయంలో చంద్ర రాజేశ్వరరావు వర్ధంతిని పురస్కరించుకుని నాయకులు కంచర్ల గురవయ్య ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో నాయకులు టి.బాబు, డి.కృష్ణ, కాలేషా పాల్గొన్నారు.

● కామవరపుకోట సీపీఐ కార్యాలయంలో జాతీయ నాయకులు చంద్ర రాజేశ్వరరావు వర్ధంతిని పార్టీ మండల కార్యదర్శి టి.వి.ఎస్.రాజు ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. రాజేశ్వరరావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో నల్లమోతుల అప్పన్న, బాలిన రమణారావు, పర్సా శ్రీను, నల్లమోతుల శ్రీను పాల్గొన్నారు.

సంపద సృష్టి కేంద్రాలపై శిక్షణ

భీమడోలు, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి) : చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలపై శిక్షణ ఇస్తున్నట్టు ఎంపీడీవో పద్మావతి తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా కో ఆర్డినేటర్ జి ప్రసంగి రాజు పాల్గొని పరిసరాల పరిశుభ్రత, తడి పొడి చెత్తను వేరు చేసే విషయాలపై అవగాహన కల్పించారు. వర్మి కంపోస్టు తయారీ ద్వారా వచ్చే ఆదాయంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కార్యదర్శులు ముత్తయ్య, వెంకట్రావు, తనూజ, భూషణం పాల్గొన్నారు.

తూకంలో మోసగిస్తే..

(ఐదో పేజీ తరువాయి)

తూకం తీస్తాం. తక్కువ ఉంటే చర్యలు తీసుకుంటాం. ఐదు కిలోమీటర్ల లోపు దూరం ఉన్న ఇళ్ల యజమానుల దగ్గర అదనంగా డబ్బులు వసూలు చేయకూడదు.

- కైకలూరు సెంటర్‌లో స్వీట్‌షాపుల్లో తూకంలో తేడా, స్వీట్లు నాసిరకంగా ఉంటున్నాయి. స్వీట్స్‌లో ఫుడ్ కలర్లు వాడడం వల్ల ప్రజలు అనారోగ్యం పాలవుతున్నారు. సంత మార్కెట్, గాంధీబొమ్మ సెంటర్‌లో కిరాణా షాపుల్లో ఎంఆర్‌పీల కన్నా ఎక్కువ ధరలు వసూలు చేస్తున్నారు.

- సీహెచ్ లలిత, కైకలూరు

ఏసీ : సంబంధిత షాపులపై ఫుడ్ ఇన్‌స్పెక్టర్లతో కలిసి దాడులు నిర్వహిస్తాం. తూకంలో తేడా, నాసిరకంగా ఉంటే చర్యలు తప్పవు. స్వీట్లలో కలర్లు వాడితే సహించేది లేదు. ఎంఆర్‌పీ కంటే ఎక్కువకు అమ్మినవారిపై జరిమానాలు విధిస్తాం.

- గణపవరం పరిసర ప్రాంతాల్లో రేషన్ షాపుల్లో డీలర్లు తక్కువ తూకంతో నిత్యావసర సరుకులు పంపిణీ చేస్తున్నారు. రేషన్ షాపులపై తనిఖీలు జరగడం లేదు.

- సుబ్రహ్మణ్యం, గణపవరం

ఏసీ: రేషన్ షాపుల్లో తనిఖీలు చేస్తాం. మోసాలకు పాల్పడే వారిపై చర్యలు తీసుకుంటాం.

- ముదినేపల్లిలో రైతుల నుంచి ప్రైవేట్ వ్యాపారులు ధాన్యం కొనుగోళ్లు చేస్తున్నారు. వీరు తూకాలు సరిగ్గా వేయడం లేదు. రైతులను మోసం చేస్తున్నారు. 75 కేజీల బస్తాకు రెండు కిలోలు తేడా చూపిస్తున్నారు.

- సుధాకర్, ముదినేపల్లి మెయిన్‌రోడ్డు

ఏసీ: ముదినేపల్లి లీగల్ మెట్రాలజీ సిబ్బందితో తనిఖీలు చేయించి, మోసం చేసే వ్యాపారులపై చర్యలు తీసుకుని న్యాయం చేస్తాం.

నాసిరకం ఆహారం

- ఏలూరు ఆసుపత్రుల చుట్టుపక్కల హోటళ్లలో నాసిరకం భోజనాలు వండిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. తనిఖీలు చేయడం లేదు. రుచి,పచి లేకపోవడం, కారంగా ఉండటంతో చిన్నపిల్లలు, మహిళలు, వృద్ధులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దీనిపై చర్యలు తీసుకోవాలి.

- పి.సాంబశివరావు, ఏలూరు

ఏసీ : ఫుడ్ ఇన్‌స్పెక్టర్లు, లీగల్ మెట్రాలజీ ఇన్‌స్పెక్టర్ల సంయుక్త ఆధ్వర్యంలో తనిఖీలు చేస్తాం. నాసిరకం, నిల్వ ఉన్న భోజన పదార్థాలను గుర్తించి హోటళ్ల యజమానులు చర్యలు తీసుకొంటాం.

మాంసం దుకాణాల్లో దగా

- కలిదిండి మెయిన్‌రోడ్డు మార్కెట్‌లో చికెన్, మటన్, చేపలు దుకాణాల్లో తూకంలో దగా చేస్తున్నారు. షాపుల్లో కొని ఇంటికి వెళ్లి తూకం చూస్తే కేజీ 100 గ్రాములపైనే తేడా ఉంటోంది. మోసాలను అరికట్టాలి.

- వెంకటేశ్వరరావు, కలిదిండి

ఏసీ : కలిదిండి ఏరియా ఇన్‌స్పెక్టర్లతో తనిఖీలు చేయిస్తాం. తూకంలో మోసాలు చేసే వ్యాపారులను గుర్తించి చట్టప్రకారం జరిమానా విధిస్తాం. మళ్లీ పునరావృతం అయితే లీగల్ మెట్రాలజీ చట్టాల మేరకు లైసెన్సు రద్దు చేస్తాం.

- జంగారెడ్డిగూడెం చేపల మార్కెట్‌లో తూకాల్లో తేడాలు జరుగుతున్నాయి. చేతి కాటాలతో మోసాలు జరుగుతున్నాయి. డిజిటల్ వేయింగ్ మెషిన్లు ఉపయోగించడం లేదు. మూడు కేజీలు కొంటే 2.50 కిలోల మించి బరువు చూస్తే రావడం లేదు. దీనిపై తనిఖీలు చేయండి.

ఏసీ : జంగారెడ్డిగూడెం చేపల మార్కెట్‌లో తనిఖీలు నిర్వహిస్తాం. తక్కువ తూచే వారిపై చర్యలు తీసుకొంటాం. డిజిటల్ వేయింగ్ మెషీన్లు వాడేలా చర్యలు తీసుకుంటాం.

పెట్రోల్ రీడింగ్‌లో తేడా

- జంగారెడ్డిగూడెం మున్సిపాల్టీ పరిధిలో పెట్రోల్ బంకుల్లో మీటరు రీడింగ్‌ల్లో తేడాలుంటు న్నాయి. దీంతో మైలేజీ రావడం లేదు. కల్తీ జరుగుతుందని మాకు అనుమానం.

- లక్ష్మణ్, ఆర్.వెంకటేశ్వరరావు, జంగారెడ్డిగూడెం

ఏసీ: పెట్రోల్ బంకుల్లో లీగల్ మెట్రాలజీ ముద్రలు వేసిన ఐదు లీటర్ల డబ్బాలు ఉంటాయి. కొలతల్లో తేడాలు వస్తే ఆ డబ్బాలో కొలత వేసుకుని తెలుసుకోవచ్చు. ఇక్కడ తనిఖీలు నిర్వహిస్తాం.



సీఎం బహిరంగ సభా వేదిక ఏర్పాట్లు

సీఎం పర్యటన ఏర్పాట్ల పరిశీలన

(ఐదో పేజీ తరువాయి)

కార్యాలయంలో ప్రభుత్వ శాఖల అధికారులతో సమీక్ష జరిపారు. అన్ని శాఖల అధికారులు పూర్తి సమాచారంతో సిద్ధంగా ఉండాలని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమాల్లో కలెక్టర్ వెట్రిసెల్వి, ఎస్పీ కేపీఎస్ కిశోర్, జేసీ పి.ధాత్రిరెడ్డి, సబ్ కలెక్టర్ స్మరణ్‌రాజ్, ఇంటెలిజెన్స్ ఏఎస్పీ కృష్ణారావు ఇతర ప్రభుత్వ అధికారులు, తెలుగుదేశం నాయకులు పాల్గొన్నారు.

ప్రత్తికోళ్ళలంకలో అంతుపట్టని జ్వరాలు

(ఐదో పేజీ తరువాయి)

చేయాలని వైద్య ఆరోగ్యశాఖ సిబ్బందిని ఆదేశించారు. గుడివాకలంక పీహెచ్‌సీ వైద్యుడు డాక్టర్ ఆనంద్ నేతృత్వంలో బుధవారం ప్రత్తికోళ్లలంకలో ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహించారు. సుమారు 150 మందికి రక్త పరీక్షలు నిర్వ హించగా ఐదుగురికి జ్వర తీవ్రత ఉన్నట్టు గుర్తించారు. మందులు అందజేశారు. గ్రామంలో ప్రత్యేక పారిశుధ్య పనులు చేపట్టారు. ఎంపీడీవో వెన్నా శ్రీలత, టీడీపీ మండల అధ్యక్షుడు నాగరాజు, కొల్లేరు సీనియర్ నాయకుడు సైదు సత్యనారాయణ తదితరులు పర్యవేక్షించారు.



కల్యాణ వేదిక వద్దకు తరలివెళుతున్న స్వామివారు, దర్శించుకున్న మంత్రి పార్థసారథి

వైభవంగా రఘునాథుని కల్యాణోత్సవం

నూజివీడు టౌన్, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): గొల్లపల్లి రఘునాథస్వామి తిరుకల్యాణ మహోత్సవాల్లో భాగంగా స్వామివారి కల్యాణ మహోత్సవ కార్యక్రమాన్ని బుధవారం రాత్రి వైభవంగా నిర్వహించారు. సంప్రదాయం ప్రకారం శ్రీరామ నవమి అనంతరం మూడో రోజు పురస్కరించుకుని రఘునాథుని కల్యాణోత్సవానికి భద్రాచలం నుంచి తలంబ్రాలను తీసుకువచ్చి నిర్వహించడం ఆనవాయితీ. స్వామి వారికి మంత్రి కొలుసు పార్థసారథి పట్టు వస్త్రాలను సమర్పించారు. రాత్రి 9 గంటలకు ప్రారంభమైన కల్యాణోత్సవం ఆలయ ప్రధాన అర్చకులు కట్ట సంతోష్ రోహిణికుమార్ ఆధ్వర్యంలో అర్ధరాత్రి వరకు కొనసాగగా కల్యాణాన్ని తిలకించేందుకు నియోజకవర్గంలోని నాలుగు మండలాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. మహోత్సవాలను దేవదాయ, ధర్మదాయ శాఖ ఈవో నల్లూరి సతీశ్‌కుమార్ తదితరులు పర్యవేక్షించారు. అనంతరం భక్త బృందం ఆధ్వర్యంలో భారీ అన్నసమారాధన నిర్వహించారు.

పెంచిన గ్యాస్, పెట్రోల్ ధరలు తగ్గించాలి

నూజివీడు టౌన్, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): పెంచిన గ్యాస్, పెట్రోల్ ధరలను తగ్గించాలని కోరుతూ సీపీఎం ఆధ్వర్యంలో రెండో రోజు బుధవారం నిరసనలు కొనసాగాయి. నూజివీడు పట్టణం చిన్న గాంధీ బొమ్మ సెంటర్ వద్ద సీపీఎం నాయకులు నిరసన తెలిపారు. సీపీఎం కార్యదర్శి జి.రాజు మాట్లాడుతూ ఎన్నికల సమయంలో పెంచిన ధరలను తగ్గిస్తామని చెప్పడం ఎన్నికల అయ్యాక ధరలను పెంచడం ప్రభుత్వాలకు రివాజుగా మారిందని విమర్శించారు. పెట్రోల్, డీజిల్ గ్యాస్ ధరలను కేంద్ర ప్రభుత్వం తక్షణం తగ్గించాలని దీనిపై రాష్ట్ర ప్రభుత్వం ఒత్తిడి తీసుకురావాలని డిమాండ్ చేశారు. సీపీఎం నాయకులు పాల్గొన్నారు.

ముసునూరు మెయిన్ సెంటర్‌లో..

ముసునూరు: పెంచిన పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలను ప్రభుత్వం తగ్గించాలని సీపీఎం జిల్లా కార్యాదర్శి జి.రాజు డిమాండ్ చేశారు. ముసునూరు మెయిన్ సెంటర్‌లో బుధవారం సీపీఎం ఆధ్వర్యంలో ఆందోళన చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పేద, మధ్యతరగతి ప్రజలపై ఆర్థిక భారాన్ని మోపుతున్నాయని విమర్శించారు. తక్షణమే పెంచిన ధరలను తగ్గించాలని డిమాండ్ చేశారు. సీపీఎం నాయకులు, స్థానికులు పాల్గొన్నారు.

ప్రజల ఆరోగ్య భద్రతే ధ్యేయం : మంత్రి

చాట్రాయి, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): ప్రజల ఆరోగ్య భద్రతే ప్రభుత్వ ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తున్నదని మంత్రి కొలుసు పార్థసారథి స్పష్టం చేశారు. కోటపాడు గ్రామానికి చెందిన ఎం. వెంకటధర్మ విజయవాడ హాస్పిటల్లో చికిత్స పొందుతూ మెరుగైన వైద్యం కోసం ఆర్థికసాయం కోరగా రూ.70 వేలు సీఎం సహాయ నిధి నుంచి ఎల్‌వోసీ బుధవారం అందించారు. ఈ సందర్భంగా మంత్రికి కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. చాట్రాయి మండల టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

గేదెను ఢీకొట్టిన పాసింజర్ రైలు

మండవల్లి, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): చావలిపాడు రైల్వేగేటు సమీపంలో బుధవారం విజయవాడ నుంచి భీమవరం వెళుతున్న ప్యాసింజర్ రైలు ఒంటిగంట ప్రాంతంలో అడ్డుగా వచ్చిన గేదెను ఢీకొట్టింది. దీంతో గేదె శరీరభాగాలు రైలు చక్రాలకు పట్టి ఉండడంతో పది నిమిషాలు పాటు రైలు నిలిపివేశారు. తిరిగి రైలును కైకలూరు స్టేషనుకు తరలించారు. ఏం జరిగిందో తెలియక ప్రయాణికులు ఆందోళన చెందారు.

నేటి నుంచి అన్నవరంలో సీతారామ కల్యాణోత్సవాలు



ముదినేపల్లి, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): అతి పురాతన కాలం నాటి ముదినేపల్లి శివారు అన్నవరం గ్రామంలోని సీతారామ మారుతీ ఆలయంలో గురువారం నుంచి కల్యాణోత్సవాలు ప్రారంభం కానున్నాయి. ప్రతీ ఏటా శ్రీరామనవమి పండుగ అనంతరం వచ్చే పౌర్ణమి రోజున ఈ ఆలయంలో సీతా రామ కల్యాణం నిర్వహించడం అనాదిగా వస్తున్న ఆచారం. ఈనెల 10న స్వామి, అమ్మవార్లను పెండ్లి కుమారుడు, పెండ్లికుమార్తెను చేయడం, 11న పూజలు అభిషేకాలు, 12న సీతారామ కల్యాణం నిర్వహిస్తామని దేవస్థానం ధర్మకర్త ముప్పవరపు రాఘవేంద్రరావు తెలిపారు. సుమారు 150 సంవత్సరాల క్రితం ఆ గ్రామానికి చెందిన ముప్పవరపు అయ్యప్ప పంతులు ఈ ఆలయాన్ని నిర్మించి, 14 ఎకరాల భూమి కూడా విరాళంగా ఇచ్చారు. ఒంటిమిట్ట తరహాలో శ్రీరామనవమి అనంతరం వచ్చే పౌర్ణమి నాడు కల్యాణం నిర్వహిస్తున్నట్లు అర్చకుడు విన్నకోట చంద్రశేఖర్ తెలిపారు.



కైకలూరులో చలివేంద్రం ప్రారంభిస్తున్న డీసీవో ఆరిమిల్లి శ్రీనివాసరావు

సహకార బ్యాంకుల్లో కంప్యూటర్ సేవలు

▸▸ డీసీవో ఆరిమిల్లి శ్రీనివాసరావు

కైకలూరు, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): సహకార సంఘాల కంప్యూటరీకరణలో కైకలూరు సబ్ డివిజన్ రాష్ట్రంలోనే ప్రథమస్థానంలో ఉందని జిల్లా సహకార బ్యాంక్ అధికారి ఆరిమిల్లి శ్రీనివాసరావు అన్నారు. బుధవారం కైకలూరులో సహకార సంఘాల అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. అనంతరం కైకలూరు సెంటర్లో సహకారం సంఘాల ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఉచిత చలివేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. కంప్యూటరీకరణ వల్ల రైతులకు సత్వర సేవలు అందడమే గాక అవకతవకలకు అవకాశం ఉండదన్నారు. కైకలూరు సబ్‌డివిజన్ పరిధిలోని 41 సహకార సంఘాలు ఆన్‌లైన్ చేశామన్నారు. పీఏసీఎస్ కార్యదర్శులు, కేడీసీస బ్యాంకు మేనేజర్లు, సిబ్బందిని ఆయన అభినందించారు.

పైలట్ ప్రాజెక్టు రీసర్వేపై రైతులకు నోటీసులు



చినకామనపూడిలో భూముల రీసర్వే వివరాల నోటీసులు అందజేస్తున్న వీఆర్వో ఏసుబాబు

ముదినేపల్లి, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): పైలట్ ప్రాజెక్టు కింద భూముల రీసర్వే నిర్వహించిన ముదినేపల్లి మండలం చినకామనపూడి గ్రామ ఏరియాలోని రైతులకు భూముల సరిహద్దుల గుర్తింపు, విస్తీర్ణంపై రెవెన్యూ అధికారుల నోటీసులు జారీ చేసే ప్రక్రియను ప్రారంభించారు. రెండు నెలలుగా ఆ గ్రామ ఏరియాలోని సుమారు 532 ఎకరాల ఆయకట్టులో భూముల రీ సర్వే నిర్వహించి ప్రభుత్వ, ప్రైవేట్ భూముల సరిహద్దులను గుర్తించారు. సర్వేపై రైతులు తమ అభ్యంతరాలను తెలియచేయవచ్చునని ఇన్‌చార్జ్ తహసీల్దార్ పవన్ కుమార్ తెలిపారు. రైతులు తమ భూముల్లో హెచ్చుతగ్గులు, సరిహద్దులపై వివరాలు తెలియజేసేందుకు త్వరలో గ్రామసభ నిర్వహిస్తామని తెలిపారు.



అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న అంగన్వాడీ టీచర్స్, సిబ్బంది

మాతా శిశు సంక్షేమానికి ప్రాధాన్యం

మండవల్లి, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): మాతా శిశు శ్రేయస్సుకు ప్రాధాన్యం ఇస్తూ ఆరోగ్యకరమైన ప్రారంభాలు ఆశాజనకమైన భవిష్యత్తు అనే నినాదంతో ప్రతీ ఒక్కరూ ముందడుగు వేయాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ నాగలక్ష్మీ పేర్కొన్నారు. భైరవపట్నంలో పోషణ పక్వాడలో భాగంగా బుధ వారం వెయ్యి రోజుల ప్రాముఖ్యత వివరిస్తూ అంగన్వాడీ సిబ్బంది, బాలిం తలు, కిశోర బాలికలతో ర్యాలీ నిర్వహించారు. ఏప్రిల్ 8వ తేదీ నుంచి 22వ తేదీవరకు అవగాహన కార్యక్రమాలు చేపడతామన్నారు. అంగన్వాడీ కార్య కర్తలు, ఆరోగ్య సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

వివాహిత ఆత్మహత్య కేసులో భర్త అరెస్టు



నిందితుడు అనిల్ కుమార్‌ను అరెస్టు చేస్తున్న డీఎస్పీ శ్రావణ్‌కుమార్

ముదినేపల్లి, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి) : వడాలిలో ఈనెల 7న గుండాబత్తిన తనుశ్రీ అనే వివాహిత బలవన్మరణం కేసులో ఆమె భర్త బెజవాడ అనిల్ కుమార్‌ను పోలీసులు అరెస్టు చేశారు. బుధవారం నిందితుడిని ముదినేపల్లిలోని సహాయ మాత హైస్కూలు సమీపంలో కైకలూరు రూరల్ సీఐ రవికుమార్, ముదినేపల్లి ఎస్ఐ వీరభద్రరావు తదితరుల సమక్షంలో ఏలూరు డీఎస్పీ డి.శ్రావణ్‌కుమార్ అరెస్టు చేశారు. నిందితుడిని కైకలూరులో కోర్టులో హాజరు పర్చగా మేజిస్ట్రేట్ రిమాండ్ విధించారు. అనంతరం అతనిని నెల్లూరు జైలుకు తరలించారు. డీఎస్పీ శ్రావణ్‌కుమార్ మాట్లాడుతూ ప్రేమించి పెళ్లి చేసుకుని ఆరు నెలలు గడవక ముందే అనిల్‌కుమార్ తన భార్య తనుశ్రీని పుట్టింటి నుంచి సొమ్ము తీసుకురమ్మని వేధిస్తున్నాడని అతని వేధింపులను భరించలేక ఈనెల 7న ఆమె తన ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడిందని తెలిపారు. ఆమె తండ్రి తిరుపతయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్న క్రమంలో బుధవారం నిందితుడిని ముదినేపల్లిలో అదుపులోకి తీసుకున్నట్టు డీఎస్పీ తెలిపారు.

హుండీల్లో నగదు చోరీ

కలిదిండి, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): ఆలయంలో హుండీ నగదును గుర్తు తెలియని దుండగులు అపహరించారు. పెదలంకలో మంగళవారం రాత్రి పరశురాముడి ఆలయంలో హుండీని అదే గ్రామంలో మట్టగుంట - కొండంగి రహదారి పక్కన ఉన్న అభయాంజనేయస్వామి విగ్రహం వద్ద ఉన్న హుండీని పగులకొట్టి నగదును అపహరించారని గ్రామస్థులు తెలిపారు.

బాలిక అదృశ్యంపై కేసు

కలిదిండి, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): బాలిక అదృశ్యంపై పోలీసులు కేసు నమోదు చేశారు. మండలంలోని ఓ గ్రామానికి చెందిన ఓ బాలిక (17) మచిలీపట్నంలో ఇంటర్ చదువుతోంది. సెలవులు ఇవ్వడంతో ఇంటి వద్దే ఉంటోంది. ఇంటర్ పాఠ్య పుస్తకాలు ఇస్తున్నారని ఈనెల 7న మచిలీపట్నంలోని కళాశాలకు వెళ్లింది. అయితే తిరిక రాకపోవడంతో ఆమె ఆచూకీ కోసం ప్రయత్నించినా ఆచూకీ లభ్యం కాలేదు. బాలిక తల్లి ఫిర్యాదు మేరకు ఎస్ఐ వెంక టేశ్వరరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



వాటర్ కూలర్ బహూకరిస్తున్న వలవల రాజా, రమేష్

వాటర్ కూలర్ వితరణ

కలిదిండి, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): కోరుకొల్లుకు చెందిన వలవల రాజా, వలవల రమేష్‌లు బుధవారం కలిదిండి పోలీస్‌స్టేషన్‌కు వాటర్ కూలర్‌ను అందించారు. ఎస్ఐ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ వాటర్ కూలర్ అందించడం అభినందనీయమన్నారు.

మంచినీటి చెరువును బాగుచేస్తాం

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

ముదినేపల్లి, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి) : బొమ్మినంపాడు శివారు రామ చంద్రపురంలో మంచినీటి చెరువు అభివృద్ధికి, విద్యుత్ దీపాల ఏర్పాటుకు చర్యలు తీసు కుంటున్నట్లు పంచాయతీ కార్యదర్శి ఎం.శ్రీనివాస్ తెలిపారు. 'తీరని దాహార్తి' అనే శీర్షికన బుధవారం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనంపై కార్యదర్శి వివరణ ఇస్తూ చెరువును పూర్తిస్థాయిలో జలజీవన్ మిషన్ కింద అభివృద్ధి చేసి స్వచ్ఛమైన తాగునీరు అందించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. వీధిదీపాలను రెండు రోజుల్లో ఏర్పాటు చేస్తామని తెలిపారు.



చింతలవల్లిలో గర్భవతులకు అవగాహన కల్పిస్తున్న సూపర్‌వైజర్ రాజ్యలక్ష్మి

పౌష్టికాహారంతో వ్యాధి నిరోధకశక్తి పెంపు

ముసునూరు, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): గర్భిణులు, బాలింతలు పౌష్టికాహారాన్ని తీసుకోవడం వల్ల వ్యాధి నిరోధకశక్తి పెరుగుతుందని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రాజ్యలక్ష్మి అన్నారు. పోషణ పక్వాడ్‌లో భాగంగా బుధవారం చింతలవల్లి, చెక్కపల్లి తదితర గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలను నిర్వహించారు. గర్భిణులు, బాలింతల సంరక్షణపై ఆమె అవగాహన కల్పించారు. అనంతరం పిల్లల గృహాలను సందర్శించి తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

● ఆగిరిపల్లి: గర్భిణులు, బాలింతలు పౌష్టికాహారం తీసుకోవాలని స్త్రీ శిశు సంక్షేమ శాఖ డైరెక్టర్ శారద అన్నారు. కృష్ణవరం సచివాలయంలో పోషణ పక్వాడ కార్యక్రమం నిర్వహించారు. గర్భిణిగా గుర్తించిన నాటి నుంచి బిడ్డకు రెండేళ్ల వరకు తీసుకోవాల్సిన సమతుల ఆహార జాగ్రత్తలను వివరించారు. సర్పంచ్ కమ్మిలి జ్యోతి, ఐసీడీఎస్ సూపర్వైజర్ సులోచనరాణి, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

● చాట్రాయి: పౌష్టికాహార పక్షోత్సవాల్లో భాగంగా చాట్రాయి మండలం పోలవరంలో తల్లులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పి.గాయత్రిదేవి ఆధ్వర్యంలో వెయ్యి రోజుల ప్రణాళికపై తల్లులకు అవగాహన కల్పించారు. గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం ఉపయోగించే విధానాన్ని వివరించారు. ఎంఎస్‌కే సుమతి, కుమారి రాజేశ్వరి, ఆశా వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.



కృష్ణవరంలో పౌష్టికాహారం అందజేస్తున్న శారద

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	123, 132, 143
చికెన్ విత్ స్కిన్	230
చికెన్ స్కిన్‌లెస్	240

నెక్ కోడి గుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ.475

'ఆవకాయ' అన్నమే గతి

నూజివీడు జడ్పీ బాలికోన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనం



నూజివీడు టౌన్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం 'ఉడికిన అన్నం పచ్చడి మెతుకులే గతి' అన్న చందంగా ఉంది. నూజివీడు జడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో బుధవారం నాసిరకంగా ఆహారాన్ని వండి కూరల బదులు 'ఆవకాయ పచ్చడి' వేశానే. దీంతోనే సరిపెట్టుకోండి అంటూ భోజన పథకం నిర్వాహకులు వ్యవహరించడంతో పిల్లలు నిర్ఘాంతపోయారు. మెత్తబడిన అన్నాన్ని మండు వేసవిలో పచ్చడితో తింటూ తమ బాధను తల్లిదండ్రులకు తెలిపారు. అధికారులు స్పందించి చిన్నారులకు పౌష్టికాహారం అందించాలని తల్లిదండ్రులు కోరుతున్నారు. బాలికోన్నత పాఠశాలలో మొత్తం 550 మంది విద్యార్థులకుగాను మెనూ ప్రకారం బుధవారం సాంబారు అన్నం ఇవ్వాల్సి ఉంది. విద్యార్థులకు పూర్తిస్థాయిలో సాంబారు సరిపోకపోవడంతో 20 మందికి ఆవకాయ పచ్చడి వేసినట్టు విద్యార్థులు చెబుతున్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ దుర్గాభవాని

వేసవిలో తాగునీటి ఎద్దడి రాకూడదు

మండల సమావేశంలో అధికారులకు ఎంపీపీ సూచన

ముసునూరు, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): వేసవిలో తాగునీటి ఎద్దడి రాకుండా ముందస్తుగా చర్యలు చేపట్టాలని ఎంపీపీ కొండా దుర్గాభవాని అన్నారు. బుధవారం ముసునూరులో మండల సర్వసభ్య సమావేశం ఎంపీపీ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా శాఖల పనితీరును అధికారులు వివరించారు. ఎంపీపీ, వైస్ ఎంపీపీ కోటగిరి రాజా, జడ్పీటీసీ డాక్టర్ ప్రతాప్ మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలను సమర్థవంతంగా అమలు చేసి, అర్హులకు అందించాలన్నారు. వేసవిలో తాగునీటి ఇబ్బందులు రాకుండా ముందస్తు ప్రణాళికలను తయారుచేసి, గ్రామాల్లో సమృద్ధిగా నీటి సరఫరా చేయాలన్నారు. రబీలో ధాన్యం కొనుగోలుకు చర్యలు తీసుకుని, పచ్చిరొట్ట విత్తనాలను సిద్ధంగా ఉంచాలన్నారు. ఉపాధిహామీ పథకంలో కూలీలకు పనికల్పించి, సకాలంలో వేతనాలు చెల్లించేలా చూడాలన్నారు. ప్రభుత్వ భవనాల నిర్మాణాలపై నివేదికను తాయారు చేసి, ఉన్నతాధికారులకు అందజేసి, వాటి నిర్మాణాలను త్వరితగతిన పూర్తిచేసేలా పంచాయతీరాజ్ అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. నూతనంగా రైతులు పెట్టుకున్న పట్టాదారు ఈ-పాస్ పుస్తకాలు సకాలంలో రావడం లేదనే ఆరోపణలు వస్తున్నాయని, పాస్ పుస్తకాలు రైతులకు అందించేలా చూడాలన్నారు. పంచాయతీల్లో నిరంతరం వీధిలైట్లు వెలుగకుండా సింగిల్ ఫేజ్ వైర్‌ను ఏర్పాటు చేయాలని ట్రాన్స్‌కో అధికారులకు సూచించారు. వైస్ ఎంపీపీ-2 పాముల గంగధరరావు, తహసీల్దార్ కె.రాజ్‌కుమార్, ఎంపీడీవో జి.రాణి, మాజీ ఎంపీపీ రావర్ల కృష్ణకుమారి తదితరులు పాల్గొన్నారు.

సీపీఐ నేత రాజేశ్వరరావుకు ఘన నివాళి

నూజివీడు, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): సీపీఐ జాతీయ మాజీ ప్రధాన కార్యదర్శి చండ్ర రాజేశ్వరరావు వర్ధంతి పట్టణ సమితి ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. రాజేశ్వరరావు చిత్రపటానికి సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు చలసాని వెంకటరామారావు పూలమాలవేసి నివాళులర్పించారు. ఆయన ఆశయాలను, పోరాటాలను ఆదర్శంగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. సీపీఐ టౌన్ సెక్రటరీ చాట్ల పుల్లారావు, పల్లె ప్రేమ్‌కుమార్, పి.ప్రవీణ్. టి.ప్రదీప్‌కుమార్, చలసాని వీరభద్రరావు, ఒగ్గు ముఖర్జీరంగా పాల్గొన్నారు.

● ముసునూరు: గుడిపాడులో అమరజీవి చండ్ర రాజేశ్వరరావు వర్ధంతి నిర్వహించారు. ఆయన చిత్రపటానికి రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రాయంకుల లక్ష్మణరావు, రైతులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కూచిపూడి నాగేశ్వరరావు, చలసాని జగన్మోహన్, మందలపు బుజ్జియ్య, బోగోలు సత్యనారాయణ, విక్రమ్, మన్మథరావు, శ్రీకాంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.